




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 83 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 3 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 83 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 3 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



# నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దంటే ఎలా?

- అలా చేసినప్పుడు విచారణ తప్పదు.. బీఆర్ఎస్ నేతలపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని వ్యాఖ్య
- నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదన్న ముఖ్యమంత్రి
- బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించింది. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. పశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదు" అని సీఎం స్పష్టం చేశారు.రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా

- మిగతా 2లో



## నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

- మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో శిక్ష అమలు
- ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది ఉరిశిక్ష విధించిన కోర్టు
- శిక్షను అమలు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడి

- మిగతా 2లో




## తెలంగాణను సంక్షోభం నుంచి గట్టెక్కిస్తూ పరుగులు పెట్టిస్తున్నాం

- ఒక్కో ఇటుక పేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామన్న మంత్రి
- ప్రభుత్వం నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పునకు నాంది పలుకుతున్నాయన్న మంత్రి
- సంస్కరణలు తెలంగాణను ఆదర్శంగా నిలుపుతున్నాయన్న మంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కిస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కో ఇటుకను పేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునికీకరించిన సమాచార

- మిగతా 2లో



## దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

- 90 ఏళ్ల వయస్సులో మెడిటేషన్ అనే ఆల్బమ్‌కు అవార్డు
- దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదన్న చైనా
- చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ

- మిగతా 2లో



## ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్.. బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు

- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ. 5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

## లోక్‌సభలో రాహుల్ vs కేంద్రం.. ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడిందనే మాట నేను చెప్పింది కాదు: రాహుల్ గాంధీ
- స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ నరవణే తన పుస్తకంలో రాశారని వెల్లడి
- ఈ పుస్తకం బయటకు వస్తే ప్రజలకు విషయం తెలుస్తుందని కేంద్రానికి భయం పట్టుకుందని వ్యాఖ్య
- దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్ సభలో లేవనెత్తేందుకు అనుమతించడం లేదని ఆరోపణ



**హైదరాబాద్ పెన్ పవర్:** లద్దాఖ్, డోక్లాం ప్రతిష్టంభన గురించి కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నలతో గందరగోళం నెలకొంది. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ఓ మ్యాగజైన్ ప్రచురించింది. ఆ వివరాలను రాహుల్ లోక్‌సభలో ప్రస్తావించారు. ఆయన వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. రాహుల్ చెబుతున్న పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని.. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని

- మిగతా 2లో



## తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-1 గనులు కేటాయించాం


- 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించినట్లు వెల్లడి
- రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి స్పందించిన కేంద్రమంత్రి
- బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించడం లేదన్న తమిళనాడు ఎంపీ

**హైదరాబాద్ పెన్ పవర్:**తాడిచెర్ల-1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి

- మిగతా 2లో

## పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కవిత కీలక వ్యాఖ్యలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే

- మిగతా 2లో



## ఆ నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు

- కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసిందన్న రామచందర్ రావు
- అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా హామీలు అమలు చేయలేదని విమర్శ
- రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని నిలదీత

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఏపీలో శాంతి భద్రతల వైఫ్యల్యానికి ఎవరు కారణం?

శాంతి భద్రతల వైఫల్యం ఏ ప్రభుత్వానికైనా చెడ్డపేరు తెస్తుంది. ఎన్ని మంచి పనులు చేసినా.. ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా శాంతిభద్రతల సమస్య మాత్రం ప్రజల్లోకి తొందరగా చొరబడుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలోనూ అదే జరిగింది. నాడు జగన్ ప్రభుత్వం టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంతో పాటు అనేక రకాలుగా లా అండ్ ఆర్డర్ సమస్య ఆ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడానికి కారణమయింది. ఇప్పుడు అదే సమస్య కూటమి ప్రభుత్వంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ఘర్షణలు, హత్యలు, అత్యాచారాలు ప్రభుత్వానికి చెడ్డపేరును తెచ్చిపెడుతున్నాయి.

**శాంతి భద్రతలు...**

నియోజకవర్గాల స్థాయిలో శాంతి భద్రతలు అదుపు తప్పడంపై వాటి ప్రభావం రానున్న ఎన్నికల్లో పడే అవకాశముందన్న ఆందోళన సీనియర్ నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందులో సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే ప్రజలకు తెలిసిపోతుంది. పోలీసులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ పోలీసుల తీరు కూడా ఆక్షేపణీయంగానే కనిపిస్తుంది. ఎవరి నుంచి వచ్చిన ఆదేశాలు మాత్రమే తెలియదు కానీ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ల ఇళ్లపై దాడులు జరిగిన సమయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఇంత బీభత్సం జరుగుతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరించడాన్ని బట్టి చూస్తే శాంతిభద్రతల పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను...**

అసలు వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను ముందుగానే పోలీసులు తొలగించి ఉంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. రెండు రాజకీయ పార్టీల మధ్య పోరు ఉన్న సమయంలో వివాదాస్పద ఫ్లెక్సీలను పెడితే ఖచ్చితంగా అక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని చెప్పాలి. ఆ మాత్రం కూడా తెలియకుండా పోలీసు శాఖ నిద్రమత్తులో జోగుతుండటాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. ఆరోజు ఫ్లెక్సీని తొలగించి ఉంటే ఇటు టీడీపీ, అటు వైసీపీ నేతల మధ్య ఘర్షణ తలెత్తి ఉండేది కాదని, అలాగే మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెడితే జోగి రమేష్ ఇంటిపై దాడికి సాహసించి ఉండే వారు కాదన్నది కూడా అంతే వాస్తవమని న్యాయవాదులు కూడా చెబుతున్నారు. ఏపీలో జరుగుతున్న ఈ వివాదాలకు పోలీసుల వైఫల్యమే కారణమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

# తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-1 గనులు కేటాయించాం

- మొదటి పేజీ తరువాయి

బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి కేంద్రమంత్రి స్పందించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఇది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిందని అన్నారు. 2020 జూన్ నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై అన్నారు. వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రైవేటు రంగ కొనుగోలుదారులకు కట్టపెడుతున్నారని ఆరోపించారు. దీంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచెర్ల-1 బొగ్గు గనులను కేటాయించినట్లు తెలిపారు.

## ఆ నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై మోసపూరిత వాగ్దానాల పేరుతో ఛార్జ్‌షీట్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు పొందిందని, కానీ ప్రజలకు ఇప్పటి వరకు చేసిందేమీ లేదని అన్నారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు, రాష్ట్రానికి ఏం చేసిందో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారని, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.4 వేల నిరుద్యోగ భృతి జాడ లేదని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని అన్నారు.

## లోక్‌సభలో రాహుల్ VS కేంద్రం..

### ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- మొదటి పేజీ తరువాయి

రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు.దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని అమిత్ షా మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ..వార్తాపత్రికల క్లిప్పింగులు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని రూల్ బుక్ నియమాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై, ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడాలని రాహుల్‌కు సూచించారు. మరోవైపు రాహుల్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీంతో సభాకార్యకలాపాలకు అంతరాయం కలగడంతో లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- మొదటి పేజీ తరువాయి

. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా నలుగురికి చైనాలో ఉరిశిక్ష అమలు చేశారు. ఈ మేరకు బాయి ఫ్యామిలీ మాఫియాకు చెందిన నలుగురికి ఉరిశిక్ష అమలు చేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది కోర్టు ఈ శిక్ష విధించింది. తాజాగా దానిని అమలు చేసింది. ఆన్‌లైన్ మోసాలతో పాటు వివిధ కేసులు ఎదుర్కొంటున్న ఈ గ్యాంగులపై చైనా కొంతకాలంగా తీవ్ర చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మయన్మార్‌కు చెందిన నేర ముఠాకు చెందిన సభ్యులకు మరణశిక్షను అమలు చేసినట్లు ఇటీవల స్థానిక మీడియా పేర్కొంది.

వేల కోట్ల రూపాయల కుంభకోణాలు, జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ మాఫియా, తమ వద్ద పనిచేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించిన 14 మంది చైనీయుల ప్రాణాలను తీసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో ముఠాలోని నలుగురికి శిక్షను అమలు చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ శిక్షను ఎప్పుడు అమలు చేశారనేది తెలియరాలేదు.

## దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులో 'మెడిటేషన్' అనే ఆల్బమ్‌కు గాను దలైలామాను ఈ అవార్డు వరించింది. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. దీనిని ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది.దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో అన్నారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని ఆయనపై ఆరోపణలు గుప్పించారు.

ఈ అవార్డును బీజింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తి అన్నారు.

తనకు గ్రామీ అవార్డు రావడంపై దలైలామా స్పందించారు. ఇది తన వ్యక్తిగత విజయంగా చూడటం లేదని అన్నారు. శాంతి, కరుణ, పర్యావరణంపై శ్రద్ధ, మానవత్వం అనేవి మానవాళి శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు. గ్రామీ గుర్తింపు ఈ సందేశాలను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

### తెలంగాణను సంక్షోభం నుంచి గట్టెక్కిస్తూ పరుగులు పెట్టిస్తున్నాం

- మొదటి పేజీ తరువాయి

పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయాలు ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతోందని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన ఇలా అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను ఆదర్శంగా నిలుపుతున్నాయని మంత్రి అన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

### నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దంటే ఎలా?

- మొదటి పేజీ తరువాయి

భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

### చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారు: భూమన కరుణాకర్ రెడ్డి

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలో సీబీఐ నివేదిక వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ నేతలపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు ఇచ్చిన నివేదిక ప్రకారమే మాట్లాడానని చంద్రబాబు అంటున్నారని భూమన ఎద్దేవా చేశారు. టీటీడీకి ఈ బోర్డును పరిచయం చేసిందే జగన్ అని చెప్పారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసే అవకాశమే లేదని సీబీఐ తెలిపిందని అన్నారు. చంద్రబాబు హయాంలోనే బోలేబాబా డెయిరీ నుంచి టీటీడీ నెయ్యి కొనుగోలు చేసిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక బోలేబాబాను డిస్ క్వాలిఫై చేశామని అన్నారు.

తాను చేసిన వ్యాఖ్యలకు అంబటి రాంబాబు క్షమాపణ చెప్పినప్పటికీ దాడులు చేశారని భూమన మండిపడ్డారు. అంబటి ఇంటి మీదకు 3 వేల మంది రౌడీలను పంపించారని అన్నారు. జోగి రమేశ్ ఇంటిపై కూడా ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని విమర్శించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు జరిగాయని అన్నారు.

### కాపుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: నిమ్మల రామానాయుడు

కాపుల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి ఏమాత్రం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాపుల భవిష్యత్తు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మాజీ మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకుని వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని రామానాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దివంగత తల్లిదండ్రులను ఉద్దేశించి అంబటి వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, అంత దారుణంగా మాట్లాడుతున్నా జగన్ ఎందుకు వారించలేదని ప్రశ్నించారు. ఇది జగన్ దర్శకత్వంలోనే జరుగుతున్న డ్రామా అని స్పష్టమవుతోందన్నారు.

**చరిత్రను గుర్తుంచుకోవాలి**

చరిత్రను గుర్తుచేస్తూ.. బ్రిటిష్ కాలం నుంచి ఉన్న కాపు రిజర్వేషన్లను కాంగ్రెస్ ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి రద్దు చేస్తే, దామోదరం సంజీవయ్య, చంద్రబాబు మాత్రమే వాటిని పునరుద్ధరించారని రామానాయుడు తెలిపారు. చంద్రబాబు ఎంతో కష్టపడి కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే, అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ వాటిని రద్దు చేసి కాపులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. కాపుల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగాను 'రౌడీ' అని, 'చంపితే తప్పేంటి' అని అన్న గౌతమ్ రెడ్డికి ఆరు నెలల్లోనే ఫైబర్ నెట్ ఛైర్మన్ పదవి ఇచ్చి జగన్ సత్కరించారని మండిపడ్డారు. రంగా హత్యలో నిందితులుగా ఉన్నవారు వైసీపీ ప్రెస్‌మీట్లలో పక్కన కూర్చుని నీతులు చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాపుల కోసం పోరాడుతానన్న ముద్రగడ పద్మనాభం తన పేరు చివర 'రెడ్డి' అని తగిలించుకున్న తర్వాత కాపుల గురించి మాట్లాడటం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామన్నారు.

**బూతుల వల్లే వైసీపీ ఓటమి**

అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని వంటి నేతల బూతుల పురాణం కారణంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని, అధికారం కోల్పోయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. లోకేశ్ పై జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలను మహిళాలోకం అసహ్యించుకుంటోందన్నారు. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటే దానికి కులాన్ని ఆపాదించడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పల్నాడు వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమ (కాపు), బుద్దా వెంకన్న (బీసీ)పై రాడ్లతో దాడి చేయించినప్పుడు జగన్‌కు వారి కులాలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

**చట్టం తనపని తాను చేసుకుపోతుంది**

గతంలో టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేసినప్పుడు అధికారంలో ఉన్న బొత్స సత్యనారాయణకు చట్టం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ శాంతిభద్రతలకే పెద్దపీట వేస్తారని, తప్పు ఎవరు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రామానాయుడు గుర్తుచేశారు. రంగాను అవమానించిన వారికి అండగా నిలుస్తున్న వైసీపీకి ఆయన పేరును ఉచ్ఛరించే హక్కు కూడా లేదని, అభివృద్ధిని పక్కనపెట్టి కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ నైజమని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# సర్వే ప్రక్రియ.. హక్కులపై ప్రభావం చూపదు

## సింగిల్ జడ్జి ఉత్తర్వులలో జోక్యం అవసరం లేదు

## ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిల భూముల వివాదంలో తేల్చి చెప్పిన హైకోర్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలోని వివాదాస్పద భూమికి సంబంధించి సర్వే వ్యవహారంలో భారాస ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిలతోపాటు మల్లారెడ్డి కుమారుడు సి.మహేందర్‌రెడ్డిలకు సోమవారం హైకోర్టులో చుక్కెదురైంది. జీడిమెట్లలో సర్వే నం.82లో ఉన్న 1.29 ఎకరాల భూమి సర్వేకు అనుమతిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీలు సహా మరో పిటిషన్‌ను కొట్టివేసింది. భూమి సర్వే, సరిహద్దులను నిర్ణయించడం అన్నది పరిపాలనా వ్యవహారంలో భాగమని పేర్కొంది. ఇది భూమి హద్దులను గుర్తించడానికి మాత్రమే ఉద్దేశించినదని, సర్వే నిర్వహించడం హక్కులపై ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టంచేసింది. మల్లారెడ్డి తదితరుల భూములకు సంబంధించి సర్వే నిర్వహించాలంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. జీడిమెట్లలో ఎస్.శ్రీనివాసరెడ్డికి చెందిన 0.33 గుంటల భూమి ఆక్రమణ వ్యవహారంపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఇదే సర్వే నంబరులో మల్లారెడ్డి తదితరులు వాణిజ్య సముదాయాలు నిర్మించి... పక్కన ఉన్న తన స్థలంలోకి వెళ్లకుండా రోడ్డును మూసివేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారించిన సింగిల్ జడ్జి సదరు భూమిని సర్వే చేయాలంటూ ఆదేశాలిచ్చారు. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ మల్లారెడ్డి తదితరులు అప్పీలుతోపాటు మరో పిటిషన్‌ను దాఖలు చేశారు.వీటిపై హైకోర్టు విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. 'వ్యవసాయ భూములను.. వ్యవసాయేతర అవసరాలకు వినియోగించేలా మార్పిడి జరిగినందున.. సర్వే చేసే అధికారం రెవెన్యూ అధికారులకు లేదన్న వాదనకు ఆధారాలు లేవు. సదరు సర్వే నంబరు రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ వ్యవసాయ భూమిగానే ఉంది. భూమార్పిడికి సంబంధించి ఎలాంటి ఆధారాలను పిటిషనర్ సమర్పించలేదు. అందువల్ల సర్వే నిర్వహించడం ద్వారా హద్దులు నిర్ణయించే రెవెన్యూ అధికారుల అధికారాన్ని ప్రశ్నించే హక్కు లేదు. సర్వే నిర్వహించడం

-4 లో



# పేదల కోసం 500 ఎకరాలు దానం చేసిన గొప్ప వ్యక్తి రావి నారాయణ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన సమరయోధుడు రావి నారాయణ రెడ్డికి తెలంగాణ సమాజంలో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రావి నారాయణ రెడ్డి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చడం, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అందరితో చర్చించి, వారి గౌరవాన్ని పెంచేందుకు మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని సముచితమైన స్థానం కల్పిస్తామని వెల్లడించారు.సోమవారం (ఫిబ్రవరి 2) 'తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు' ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం 2025'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ

-4 లో

# కేసీఆర్‌పై అక్కసును మరోసారి బయటపెట్టిన సీఎం హరీశ్‌రావు విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్::** హేట్ స్పీచ్‌పై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హితబోధ చేసిన కొద్ది నిమిషాల్లోనే అదే వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి తన మాటల ద్వారా కేసీఆర్‌పై అక్కసును మరోసారి బయటపెట్టారని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా సోమవారం ఆయన స్పందించారు. 'హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు. సీఎం ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్‌లో చదువుకున్నా రేవంత్‌రెడ్డి మాటతీరు మాత్రం మార్చుకోలేదు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతిపితనే. నాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే..ఆంధ్రా పాలకుల పక్కన చేరిన మీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుంది? ప్రశ్నిస్తే కేసులు పెడుతున్న మీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కుందా?' అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ విచారణ దశలో ఉండగా, కోర్టు తీర్పు రాకముందే 'ఇల్లీగల్' అని సీపీ సజ్జనార్ ఎలా నిర్ణయిస్తారని మరో ప్రకటనలో ప్రశ్నించారు. తీర్పులు చెప్పాల్సింది పోలీసులు కాదని, కోర్టులు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

# ఇప్పటికే అనుభవిస్తున్నవు చాలదా: కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడారం మహా జాతర నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. ఆదివాసీ బిడ్డగా, మంత్రి హోదాలో నిరంతరం శ్రమించి మేడారం మహా జాతరను గ్రాండ్స్ సక్సెస్ చేశామని.. అది మీ కళ్లకు కనిపించ లేదా అని ప్రశ్నించారు. ఆడబిడ్డను అబాసుపాలు చేస్తే ఆగమైవతని.. సొంత చెల్లిన మోసం చేసి ఇప్పటికే అనుభవిస్తూ ఇంకా చాలదా కేటీఆర్ అంటూ నిప్పులు చెరిగారు. మీరు ఒక్కరోజు కూడా సమ్మక్కసారక్క దర్శనానికి రాలేదని.. అలాంటి మీరు తల్లుల మీద నెగటివ్ ప్రచారం చేయకండి కర్మ ఫలితం తప్పదని హెచ్చరించారు. నాపై రాజకీయాలు చేయండి కానీ మా దేవుళ్లపై కాదన్నారు. మా దేవుళ్ళ జోలికి వస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. 2026 సమ్మక్కసారలమ్మ మహా జాతర విజయవంతమైందన్నారు. వారం రోజుల పాటు మేడారం దగ్గర 24/7 డ్యూటీలో ఉండి జాతరను సూపర్ సక్సెస్ చేశామని చెప్పారు.

-4 లో

# బడ్జెట్‌లో రైతుల ఆశలు అడియాసలయ్యాయి



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర బడ్జెట్ తెలంగాణ రైతులకు తీవ్ర నిరాశను కలిగించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగంలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎలాంటి ప్రయోజనం కల్పించలేదని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. వ్యవసాయ మార్కెటింగ్, ధరల స్థిరీకరణ, మార్కెట్ సంస్కరణలపై స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం బడ్జెట్‌లో ప్రధాన లోపమన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "ఎన్నిసార్లు విన్నవించినా ఆయిల్‌పాం దిగుమతులపై సుంకం పెంపు గురించి కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి బదులుగా... దిగుమతులకు అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరం. పసుపు బోర్డుకు నిధులను కేటాయించలేదు. కొబ్బరి ప్రాంతీయ మండలి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోలేదు. ధరల భద్రత, మార్కెట్ భరోసా లేకుండా కేవలం ఏఐ సాంకేతికతలతో రైతుల సమస్యలు పరిష్కారం కావు" అని స్పష్టం చేశారు.

- ఓటీఆర్‌లో టీజీపీఎస్సీ కీలక సంస్కరణ
- కొత్త నోటిఫికేషన్ల దరఖాస్తుకు ఇదే అర్హత
- ఈ నెల 25లోగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచన

# అభ్యర్థులూ.. సమాచారం అప్‌డేట్ చేయండి




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసుల కమిషన్(టీజీపీఎస్సీ) కీలక సంస్కరణ చేపట్టింది. దరఖాస్తు నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన వరకు జాప్యాన్ని తగ్గించడంతోపాటు పారదర్శకత, జవాబుదారీతనం పెంచనుంది. దరఖాస్తులో కీలకమైన వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) చేసుకున్న 31.56 లక్షల మంది తమ ఐడీ సహాయంతో తాజా వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టంచేసింది. తాజా వివరాల ఆధారంగానే భవిష్యత్తు నియామక పరీక్షకు దరఖాస్తు చేసేందుకు అర్హత లభిస్తుందని వెల్లడించింది. ఈ నెల 25లోగా అభ్యర్థులందరూ అదనపు అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఓటీఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు.

# న్యాయాధికారుల పోస్టుల భర్తీకి ఏకరూప పరీక్ష

## భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ డిమాండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** అఖిల భారత సర్వీసుల కోసం దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష విధానం ఉన్నట్లుగానే కిందిస్థాయి కోర్టుల్లో న్యాయాధికారుల పోస్టుల భర్తీకి అఖిల భారతస్థాయి న్యాయసేవల పరీక్షలు నిర్వహించాలని భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం రాజ్యసభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు.

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆదానీ గ్రూప్ కు టోకరా...

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:** వైట్‌కాలర్ నేరాలు రోజురోజుకూ సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. సామాన్యులను ముంచే చిన్నపాటి చీటింగ్‌ల నుంచి ఏకంగా అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థలనే బురిడీ కొట్టించే స్థాయికి నేరగాళ్లు ఎదిగారు. తాజాగా ఆదానీ గ్రూప్‌కు చెందిన ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ ఏసీసీ లిమిడెట్‌ను టార్గెట్ చేస్తూ జరిగిన ఒక భారీ మోసం వెలుగులోకి వచ్చింది. కేవలం నకిలీ పత్రాలతో ఒక సినిమా లెవల్‌లో ప్లాన్ చేసి, సుమారు రెండు కోట్ల విలువైన సిమెంట్‌ను కాజేసిన ఈ ఘటన ఇప్పుడు పారిశ్రామిక వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది.లక్కీ భాస్కర్ సినిమాలో బ్యాంకింగ్ లొసుగులను వాడుకుని ఎలా మోసాలు పాల్పడతారో చూశాం. సరిగా అదే తరహాలో బ్యాంక్ గ్యారంటీ అనే ఆయుధాన్ని వాడుకొని నిందితులు అదానీ గ్రూప్‌కు భారీ కుచ్చు టోపీ వేశారు.హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వివరాల ప్రకారం జేపీ ఇన్‌ఫ్రా అండ్ ఇంజనీరింగ్ అనే సంస్థ యజమాని జ ప్రకాష్ ఇన్నార్తి , అతని సహచరుడు మన్మోహన్ కలిసి ఈ కుట్రకు తెరలేపారు. వీరు పంజాబ్ నేషనల్ బ్యాంకు పేరుతో ఒక నకిలీ బ్యాంకు గ్యారంటీ పత్రాన్ని సృష్టించారు. ఈ పత్రం విలువ అక్షరాల 2కోట్లు. ఈ నకిలీ బ్యాంకు గ్యారంటీని అసలైనదిగా నమ్మించి, నిందితులు ఏసీసీ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్ సంస్థలను సంప్రదించారు. భారీ ప్రాజెక్టుల పేరుతో తమకు సిమెంట్ సరఫరా చేయాలని కోరారు. సదరు బ్యాంక్ గ్యారంటీ నిజమేనని నమ్మిన కంపెనీ యాజమాన్యం, నిందితులకు




వివిధ విడతల్లో సిమెంట్‌ను సరఫరా చేసింది.దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం సరఫరా చేసిన సిమెంట్ విలువ 2,02,05,368 రూపాయలు అయితే, నిందితులు చెల్లించిన మొత్తం 5,60,000 రూపాయలు, మోసం చేసిన మిగిలిన మొత్తం 1,96,45,368 రూపాయలు. అంటే రెండు కోట్లకుపైగా విలువైన సరకును తీసుకొని కేవలంనామమాత్రపు సొమ్మును మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.1.96 కోట్లను నిందితులు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టారు. నిందితుల నుంచి బకాయిలు రాకపోవడంతో ఏసీసీ సంస్థ ఆందోళన చెందింది. చివరికి తమ వద్ద ఉన్న రెండు కోట్ల బ్యాంక్ గ్యారంటీని నగదుగా మార్చుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఏసీసీ ప్రతినిధులు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను సంప్రదించగా, అక్కడ వారికి పెద్ద షాక్ తగిలింది. నిందితులు సంప్రదించగా అక్కడ వారికి పెద్ద షాక్ తగిలింది. నిందితులు సమర్పించిన ఆ బ్యాంక్ గ్యారంటీ పత్రం తమ బ్యాంక్ నుంచి జారీ కాలేదని, అది పూర్తిగా ఫోర్జరీ చేసిన నకిలీ పత్రమని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో తాము నిలువునా మోసపోయామని గ్రహించిన అదానీ గ్రూ ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించారు. ఏసీసీ లిమిటెడ్ రీజినల్ సేల్స్ మేనేజర్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా తీసుకున్న పంజాగుట్ట పోలీసులు, జనవరి 24న కేసు నమోదు చేశారు. జయప్రకాష్ ఇన్నార్తి, మన్మోహన్, ఇతరులపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 406, 420 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు సమాచారం.

# చిత్తడి నేలల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు.. పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ




**హైదరాబాద్ పెన్ పవర్:** చిత్తడి నేలల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వీటి సంరక్షణలో స్థానిక ప్రజల అనుభవాలు, సంప్రదాయ జ్ఞానం కీలకమని అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారి డాక్టర్ సి. సువర్ణ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అరణ్య భవన్‌లో అటవీ శాఖ అధికారులతో ఇవాళ సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ సి.సువర్ణ అధ్యక్షతన జరిగిన భేటీలో చిత్తడి నేలల సంరక్షణపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ.. చిత్తడి నేలల సంరక్షణలో స్థానిక ప్రజల అనుభవాలు, తరతరాలుగా వస్తున్న సంప్రదాయ జ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజల జీవన విధానాలు, సాంస్కృతిక ఆచారాలతో చిత్తడి నేలలు విడదీయరాని బంధాన్ని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. నీటిని సహజంగా శుద్ధి చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో చిత్తడి నేలల పాత్ర కీలకమని అధికారులు వివరించారు. అడవుల కంటే ఎక్కువగా కార్బన్‌ను ఇవి నిల్వ చేయగలవని, తద్వారా గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు సహకరిస్తున్నాయని తెలిపారు. జీవ వైవిధ్యానికి కేంద్రాలుగా ఉండే చిత్తడి నేలలు పక్షులు, చేపలు, ఇతర జీవజాతులకు ప్రధాన ఆవాసాలుగా ఉన్నాయన్నారు.చిత్తడి నేలల సంరక్షణ, నిర్వహణ కోసం 2017 నిబంధనల ప్రకారం 'తెలంగాణ రాష్ట్ర చిత్తడి నేలల అథారిటీ' ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అటవీ శాఖ మంత్రి చైర్‌పర్సన్‌గా, అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తుండగా, జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు పనిచేస్తున్నాయని చెప్పారు. పర్యావరణపరంగా కీలకమైన చిత్తడి నేలలను గుర్తించి, నోటిఫికేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. మంజీరా, పాఖాల్, పోచారం, కిన్నెరసాని వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి రాంసార్ స్థలాలుగా గుర్తించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో పీసీసీఎఫ్‌లు వినయ్ కుమార్, రత్నాకర్ జౌహరి, సీసీఎఫ్‌లు శరవణన్, క్షితిజ, వైల్డ్‌లైఫ్ ఓఎస్డీ శంకరన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సౌమ్య కుటుంబానికి అండగా ప్రభుత్వం

## ఎక్సైజ్ పోలీసులకు ఆయుధాలు

**నిజామాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:** సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు, మాదక ద్రవ్యాల మహమ్మారిని అంతం చేసేందుకు కొందరు అధికారులు తమ ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు. అటువంటి ఒక ధీరవనిత, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య. గంజాయి స్మగ్లర్ల అరాచకానికి ఎదురొడ్డి నిలిచి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆమె త్యాగం నేడు యావత్ తెలంగాణను కన్నీటి పర్యంతం చేస్తోంది. జనవరి 23న నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ బృందం తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలోనే స్మగ్లర్లు తప్పించుకునే ప్రయత్నంలో తమ వాహనంతో సౌమ్యను అత్యంత కిరాతకంగా ఢీ కొట్టారు. అంతటితో ఆగకుండా ఆమెపై నుంచి వాహనాన్ని పోనిచ్చారు. తీవ్రంగా గాయపడిన సౌమ్య చావుబతుకుల మధ్య పోరాడుతూ, ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ కన్నుమూశారు. సౌమ్య త్యాగాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఆమె కుటుంబానికి అండగా నిలిచేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటించింది. ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించబోతున్నట్టు మంత్రి తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. ఈ ఘటన ఎక్సైజ్‌శాఖలో ఒక ప్రధాన చర్చకు దారి తీసింది. సాధారణ పోలీసులు మాదిరిగా కాకుండా ఎక్సైజ్ అధికారులు తరచూ ఆయుధాలు లేకుండానే ప్రమాదకరమైన స్మగ్లర్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే క్షేత్రస్థాయి అధికారులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై విధి నిర్వహణలో ఉన్న ఎక్సైజ్ పోలీసులకు ఆయుధాలు సమకూరుస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. సౌమ్య మృతదేహం ఆమె స్వగ్రామం నిజామాబాద్ జిల్లా మోస్రా చేరుగానే ఆ ప్రాంతమంతా శోకసంద్రమైంది. తమ ఊరి బిడ్డ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీరనారిని ఆఖరిసారి చూసేందుకు ప్రజలు తరలి వచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు ఊరంతా ఆమె పార్థి దేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌమ్య అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది భారీగా తరలి వచ్చి తమ సహచర ఉద్యోగికి ఘన నివాళి అర్పించారు. గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

# కేసీఆర్ భావోద్వేగం...
# అప్పుడు అస్థిత్వం... ఇప్పుడు విచారణలా.

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. గత పదేళ్లు రాష్ట్రాన్ని శాసించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నందినగర్ నివాసంలో సిట్ అధికారుల విచారణనుదఎదుర్కొన్నారు. కేవలం విచారణే కాదు, అక్కడ చోటుచేసుకున్న పరిణామాలు, కేసీఆర్ వ్యక్తం చేసిన భావోద్వేగాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. విచారణ ప్రారంభానికి ముందు కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు తెలుస్తోంది. మధ్యాహ్న భోజన సమయంలో తన సన్నిహితుల వద్ద ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం తెలంగాణ ఉద్యమ కాలంలో కీలక నిర్ణయాలకు వేదిక. "స్వరాష్ట్ర సాధన కోసం ఇదే గదిలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. వ్యూహాలు రచించాను. అలాంటి పవిత్రమైన చోట నేడు నేరారోపణలపై విచారణ ఎదుర్కోవాల్సి రావడం బాధాకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "తెలంగాణ అస్థిత్వం కోసం పోరాడిన గదిలో.. ఇప్పుడు అదే రాష్ట్రంలో విచారణ ఎదుర్కోవడం కాలం చేసిన వింత క్రీడ." అని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు.ఆదివారం



మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ విచారణలో సిట్ అధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు సమాచారం. సాధారణంగా విచారణ సమయంలో న్యాయవాదులను అనుమతించాలని కోరుతుంటారు, కానీ సిట్ అధికారులు ఇందుకు నిరాకరించారు. నిబంధనల ప్రకారం కేవలం కేసీఆర్‌ను మాత్రమే ప్రశ్నించారు. విచారణ మొదలవ్వగానే మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ఇతర కీలక నేతలను అధికారులు బయటకు పంపేశారు. లోపల కేసీఆర్, సిట్ బృందం మాత్రమే ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక అధికారుల వాంగ్మూలాలు, రికార్డైన ఆధారాల ప్రాతిపదికన కేసీఆర్‌పై ప్రశ్నల వర్షంకురిపించినట్లు తెలుస్తోంది.కేసీఆర్ విచారణ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నందినగర్ నివాసం చుట్టూ భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు.తమ నాయకుడిని విచారించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు అక్కడక్కడా నిరసనలకు దిగుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా కనిపిస్తోంది. కేసీఆర్ భావోద్వంతో కేడర్ లో సెంటిమెంట్ పెరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతోందని సమర్థించుకుంటోంది. అయితే బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ దుమారం ఏ స్థాయిలో రచ్చకు కారణమయ్యాయో తెలుసు. కానీ ఉద్యమనేత కేసీఆర్ నే విచారించడాన్ని మాత్రం బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. తెలంగాణ సాధించిన నేతగా, దశాబ్ద కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి విచారణ ఎదుర్కోవాల్సి రావడం విశేషమే.!

## ఇప్పటికే అనుభవిస్తున్నవు చాలదా: కేటీఆర్‌పై మంత్రి సీతక్కఫైర్

-3 పేజి తరువాయి

మొదటి రోజు నుంచి కొన్ని శక్తులు, పార్టీలు తప్పుడు వార్తలతో గుడి నిర్మాణాన్ని అడ్డుకోబోయానని.. కానీ పూజారుల ఆమోదం, ఎండోమెంట్ అనుమతితో 100 రోజుల్లో గుడి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. మేడారం జాతరలో 13 వేల మంది పోలీసులు సేవలందించారని, చిన్నపాటి లోపాలు ఏవైనా ఉంటే భవిష్యత్తులో మరింత మెరుగ్గా సరిదిద్దుకుంటామన్నారు. భక్తులు సంతోషంగా వన దేవతలనుదర్శనం చేసుకున్నారని తెలిపారు.

## న్యాయాధికారుల పోస్టుల భర్తీకి ఏకరూప పరీక్ష

-3 పేజి తరువాయి

'న్యాయవ్యవస్థలో కిందిస్థాయి న్యాయాధికారుల పోస్టుల భర్తీకి దేశవ్యాప్తంగా ఏకరూప పరీక్ష లేదు. విభిన్న రాష్ట్రాల్లో విభిన్న సిలబస్, విభిన్న పరీక్షా విధానాలు అమలు చేస్తున్నందున ఉద్యోగార్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నాయి. దీనివల్ల నోటిఫికేషన్లు, పరీక్షల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఖాళీలు ఏళ్ల తరబడి భర్తీ కావట్లేదు. ఉన్న సిబ్బందిపైనే ఎక్కువ పనిభారం పడుతోంది. పోటీపడే అభ్యర్థులు ప్రతిరాష్ట్రానికి వేర్వేరుగా సమాయత్తం కావడంతో పాటు వేర్వేరుగా దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తున్నందున ఆర్థికంగా, సమయపరంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఆర్టికల్ 312 కింద ఇలా పరీక్ష నిర్వహించడానికి అవకాశం ఉన్నందున ఈ విధానాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సుప్రీంకోర్టు పలుసార్లు చెప్పింది. అందువల్ల కిందిస్థాయి కోర్టుల్లో న్యాయాధికారుల నియామకానికి దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమల్లోకి తేవాలి' అని లక్ష్మణ్ పేర్కొన్నారు.

## అభ్యర్థులూ.. సమాచారం అప్‌డేట్ చేయండి

**ధ్రువపత్రాల పరిశీలన సులభతరం**

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తయింది. ఎస్సీ అభ్యర్థులకు సంబంధించి ఉపకులాల వారీగా గ్రూపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా అభ్యర్థులు ఓటీఆర్‌లో సవరణ చేయాలంటూ ఇప్పటికే కమిషన్ సమాచారం ఇచ్చింది. వీరితోపాటు మిగతా అభ్యర్థులు కూడా తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని స్పష్టంచేసింది. గతంలో విద్యార్హతలు, వ్యక్తిగత వివరాలు పేర్కొన్నా వాటికి ఎలాంటి ఆధారాలు సమర్పించాలని లేదు. తాజాగా అన్ని ఆధారాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా భవిష్యత్తులో ఏదైనా ఒక నియామక ప్రకటనకు వారు అర్హులవుతారా? లేదా? అనేది సాంకేతిక పరిజ్ఞానంతో నిర్ణయించనున్నారు. దీని ద్వారా ఫలితాలు విడుదలయ్యాక ధ్రువపత్రాల పరిశీలన మరింత సులభతరమవుతుంది. ముందుగానే ఓటీఆర్‌లో వివరాలన్నీ నిక్షిప్తంకావడంతో వాటిని సంబంధిత యూనివర్సిటీల ద్వారా ముందస్తు పరిశీలన చేపట్టి వేగంగా నియామక ప్రక్రియలు ముగించేందుకు వీలవుతుందని కమిషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సవరణలు ఇలా..: ఉద్యోగార్థులందరూ ఓటీఆర్‌లో తాజా కలర్ ఫొటోను అప్‌లోడ్ చేయాలి. కొత్త విద్యార్హతలను నమోదు చేయడంతోపాటు ధ్రువపత్రాలు సమర్పించాలి. ఒకసారి అప్‌డేట్ చేసిన ఓటీఆర్.. ఆ అభ్యర్థి లేదా కమిషన్ రద్దు చేసేవరకూ చెల్లుబాటవుతుంది. ఓటీఆర్‌లో అదనపు అర్హతలు, చిరునామా, ఈడబ్ల్యూఎస్, నాన్‌క్రీమీలేయర్ కేటగిరీలు, మొబైల్ నం., ఈ–మెయిల్ ఐడీ మినహా ఇతర వివరాలు అప్‌డేట్ చేయడానికి వీల్లేదు.

**ఇంజినీరింగ్ సర్వీసులతో జాబ్ క్యాలెండర్‌లో తొలి నోటిఫికేషన్**

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు ఇచ్చేందుకు టీజీపీఎస్సీ సిద్ధమవుతోంది. ఇప్పటికే పెండింగ్ నియామకాలన్నీ పూర్తిచేసిన కమిషన్.. కొత్తగా గుర్తించిన ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సమాయత్తమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో భాగంగా తొలుత ఇంజినీరింగ్ సర్వీసులతో నియామక ప్రక్రియను కమిషన్ ప్రారంభించనుంది. ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగాల్లో గుర్తించిన ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయనుంది. తాజాగా చేపట్టిన ఓటీఆర్ అప్‌డేట్ ముగిసిన తరువాత నోటిఫికేషన్ విడుదల కానుంది. ప్రభుత్వ విభాగాల నుంచి అందిన ప్రతిపాదనలు, రోస్టర్ ఆధారంగా కమిషన్ ఇప్పటికే పరిపాలన ప్రక్రియ పూర్తిచేసిందని, 500కుపైగా ఇంజినీరింగ్ పోస్టులతో తొలి ప్రకటన రానుందని సమాచారం.

## సర్వే ప్రక్రియ.. హక్కులపై ప్రభావం చూపదు

-3 పేజి తరువాయి

వల్ల మల్లారెడ్డి తదితరులు హక్కులను నిర్ణయించి.. వారిని ఖాళీ చేయిస్తారన్న ఆందోళనకు అర్థం లేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రస్తుత దశలో సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకుంటే సరిహద్దుల వివాదాన్ని పొడిగిస్తూ మరిన్ని వివాదాలకు అవకాశం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించింది. సంబంధిత అధికారులు అన్ని పక్షాలకు నోటీసులు జారీచేసి, సర్వేలో వారు పాల్గొనడానికి అవకాశం ఇస్తే.. హద్దుల గుర్తింపులో న్యాయం జరిగినట్లవుతుందని పేర్కొంది.

## పేదల కోసం 500 ఎకరాలు దానం చేసిన గొప్ప వ్యక్తి రావి నారాయణ రెడ్డి

-3 పేజి తరువాయి


పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా, పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి.

బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి' అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు. దేశంలో మొట్టమొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్నిరావి నారాయణ రెడ్డితో నెహ్రూ ప్రారంభింపజేశారు. 60 ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణ రెడ్డి. మున్సిపల్ ఎన్నికల అనంతరం రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు.రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి దక్కడం సముచితమని అన్నారు. "నిర్వాహకులు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. తొలితరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలితరంలో ఎస్. జైపాల్ రెడ్డి , సుదర్శన్ రెడ్డి వంటి వారు తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చారు. సుదర్శన్ రెడ్డి తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో వారు పోషించిన పాత్ర మనందరికీ గుర్తుంది. వారి అనుభవాలు పరిపాలనలో ఉపయోగపడుతున్నాయి" అని వివరించారు.హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ అపార్ట్‌మెంట్‌లో గంజాయి సాగు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో షాకింగ్ ఘటన వెలుగుజూసింది. గంజాయి కి అలవాటు పడిన ఇద్దరు యువకులు ఏకంగా ఇంట్లోనే సాగు చేశాడు. ఆన్‌లైన్‌లో విత్తనాలు కొని అపార్ట్‌మెంట్‌లోని పూల కుండీల్లో సాగు చేశారు. సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడుల్లో 12 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితులు ధ్రువ్ ఠాకూర్(ఢిల్లీ), అర్పిత్ స్టీఫెన్ ప్రకాశ్(యూపీ)లను అరెస్ట్ చేశారు. ఏ ఏరియాలో అనే వివరాలు ఇంకా వెల్లడించలేదు.మరోవైపు ఇలాంటి ఘటనే ఇటీవల సంగారెడ్డిలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఏకంగా ఆలయ ప్రాంగణాన్నే గంజాయి తోటగా మార్చేశాడు ఓ పూజారి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పంచగాం గ్రామంలో వెలుగుచూసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామంలోని ఆలయంలో పూజారిగా, ఆధ్యాత్మిక గురువుగా చలామణి అవుతున్న అవుటి నాగయ్య , భక్తి ముసుగులో గంజాయి సాగు చేస్తూ ఎక్సైజ్ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. ఇది మరువకముందే హైదరాబాద్‌లో గంజాయి సాగు వార్త కలకలం రేపుతోంది.






## చౌమహల్లా ప్యాలెస్‌లో మార్పు కోసం చేతులు కలిపిన ప్రముఖులు



**హైదరాబాద్ పెన్ పవర్:** చారిత్రక చౌమహల్లా ప్యాలెస్‌లోని అద్భుతమైన షాండిలియర్ల కాంతిలో, గ్రామీణ భారత భాగ్యం మార్చే సమున్నత లక్ష్యం కోసం నగరం ఏకమైంది. గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని అందిస్తూ ఆరోగ్యం, ఉత్పాదకతను పెంచుతున్న కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ నిర్వహించిన వార్షిక ఫండ్‌రైజర్ 2026 శనివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో దాతృత్వవేత్తలు, కార్పొరేట్ ప్రముఖులు, సినీ ప్రముఖులు పాల్గొని గ్రామీణ నీటి భద్రతకు మద్దతు ప్రకటించారు. రేస్‌విన్ ఫౌండేషన్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో, ఫండ్‌రైజింగ్ కమిటీ చైర్‌పర్సన్ ప్రతిక్ష ప్రసాంత్ నేతృత్వంలో దాతలు స్పందించి, మరో 25 గ్రామీణ పాఠశాలలకు సురక్షిత నీటిని అందించేందుకు అవసరమైన నిధులను సమకూర్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నిర్మాత పింకీ రెడ్డి, ప్రత్యేక అతిథి వక్తగా విచ్చేసిన సామాజిక కార్యకర్త, నటి నందితా దాస్ సురక్షిత నీరు ప్రాథమిక హక్కు అని, అది అభివృద్ధికి తొలి అడుగు అని అభిప్రాయపడ్డారు. సంస్థ వ్యవస్థాపకుడు రవి రెడ్డి మాట్లాడుతూ, కేవలం దానధర్మం కాకుండా కమ్యూనిటీల భాగస్వామ్యంతో నడిచే నివారణాత్మక ఆరోగ్య మౌలిక వసతులుగా ఈ ప్రాజెక్టులను తీర్చిదిద్దామన్నారు.

## కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లకు ఎన్నికల కమిషనర్ ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల అనంతరం ఈనెల 16వ తేదిన జరగబోయే మేయర్, చైర్మెన్ ఎన్నికల్లో పాల్గొనే ఎక్స్ అఫీషియో సభ్యులు(పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు) వివరాలను అందజేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో నమోదుకాబడిన మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ వివరాలను అందజేయాలని ఆదేశించారు. కొత్తగా నమోదు చేసుకోవడానికి సంబంధిత సభ్యుల ద్వారా తేదీ 11.02.2026 నుండి 14.02.2026 వరకు వివరాలు సేకరించాలని మున్సిపల్ కమిషనర్లను కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీడీఎంఏ డాక్టర్ టీకే.శ్రీదేవి, ఎన్నికల పరిశీలకులు మకరంద్, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లింగ్యా నాయక్ పాల్గొన్నారు.

రేపు నామినేషన్ల ఉపసంహరణ.. మున్సిపల్ ఎన్నికల మంగళవారం ఓ ఘట్టం ముగియనుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో 2,996 వార్డులకుగాను 20,313 మంది 29,694 నామినేషన్ సెట్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలనలో 705 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 19,608 నామినేషన్లు అర్హత సాధించాయని అధికారులు వెల్లడించారు. అయితే మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి అవకాశముంది. అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల ఫైనల్ లిస్టు ఎన్నికల అధికారులు వెల్లడించనున్నారు. దీంతోపాటు బరిలో ఉండే ఇండిపెండెంట్ అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు TET నుంచి మినహాయించివ్వండి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సర్వీస్‌లో కొనసాగాలన్నా, పదోన్నతి పొందాలన్నా ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి మినహాయించివ్వాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీం కోర్టు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా టెట్ నిబంధనలను తప్పనిసరి చేస్తూ తీర్పు నివ్వడంతో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్గం దామోదర్ రెడ్డి, సుంకరి భిక్షంగౌడ్‌తో పాటు పార్లమెంటు ఆవరణలోని విద్యా మంత్రి కార్యాలయంలో ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిసి ప్రాతినిథ్యం చేశారు. దీనికి స్పందించిన మంత్రి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి రెండు వేర్వేరు తీర్పులలో టెట్ నిబంధనను తప్పనిసరి చేయడంతో సమస్య ఏర్పడిందని, ఈ సమస్యను అధిగమించడానికి న్యాయపరమైన సలహా తీసుకుని ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పీఆర్టీయూటీఎస్ నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల సతీష్‌రెడ్డి ఉన్నారు.

# నిజాం నగలు తరలింపుపై ప్రతిష్టంబన

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:**
హైదరాబాద్ రాజ్య చరిత్ర అంటేనే అంతులేని వైభవం. ఆ వైభవానికి తలమానికం 'నిజాం ఆభరణాలు'. ఈ నగలు కేవలం రాచరికపు అలంకరణలు మాత్రమే కావు, అవి దక్కన్ సంస్కృతికి, మొఘలాయిల కాలపు కళా చాతుర్యానికి, గోల్కొండ వజ్రాల స్వచ్ఛతకు నిదర్శనాలు. తాజాగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో ఈ నిధికి సంబంధించిన లోతైన విషయాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.ఏడో నిజాం నవాబ్
మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కాలంలో ఈ నగలు అత్యున్నత దశకు చేరుకున్నాయి. 1948లో హైదరాబాద్ విలీనం తర్వాత, తన వారసుల ఆర్థిక భద్రత కోసం నిజాం రెండు ప్రధాన ట్రస్టులను ఏర్పాటు చేశారు. ఒకటి 1951లో ఏర్పాటు చేసిన నిజాం జ్యువెలరీ ట్రస్ట్ కాగా రెండోది 1952లో ఏర్పాటు చేసిన నిజాం సప్లిమెంటరీ జ్యువెలరీ ట్రస్ట్. ఈ ట్రస్టులలోని 173 ఆభరణాలను విక్రయించకుండా, కేవలం నిజాం కుటుంబ వారసుల హక్కులను కాపాడేలా నిబంధనలు రూపొందించారు. అయితే, కాలక్రమేణా వారసుల మధ్య తలెత్తిన వివాదాలు, పన్ను సమస్యల వల్ల ఈ నిధిని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.1970వ దశకంలో నిజాం వారసులు ఈ నగల వేలానికి ప్రయత్నించగా, భారత ప్రభుత్వం జోక్యం చేసుకుంది. "ఇవి దేశం గర్వించదగ్గ జాతీయ సంపద, వీటిని విదేశీయులకు విక్రయించకూడదు" అని కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ కాలం పాటుజరిగిన ఈ న్యాయపోరాటం 1995లో ముగిసింది. అప్పట్లో ఈ నగల విలువపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో వీటి విలువ వేల కోట్లు ఉంటుందని అంచనా వేసినప్పటికీ, నిజాం
వారసులతో కుదిరిన ఒప్పందం ప్రకారం రూ. 218 కోట్లకు భారత ప్రభుత్వం వీటిని దక్కించుకుంది. ఒప్పందం ప్రకారం, అప్పటి నుంచి ఈ నగలు ముంబైలోని ఆర్బీఐ ప్రధాన కార్యాలయంలోని అత్యంత సురక్షితమైనరహస్య గదుల్లో భద్రపరిచారు.ఈ 173 నగల సేకరణలో కొన్ని ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి ఉన్నాయి. అందులో జాకబ్ డైమండ్ ఒకటి. ఇది ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద వజ్రం. ఇది 184.75 క్యారెట్ల బరువు కలిగి ఉంటుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నిజాం తన టేబుల్‌పై దీనిని ఒక పేపర్ వెయిట్‌గా వాడేవారు. విక్టోరియా వజ్రం కంటే ఇది పెద్దది. ఇంకో ముఖ్యమైన ఆభరణం సత్లదా. ఏడు వరుసల ముత్యాల హారం
ఇది. ఇందులో ఉపయోగించిన ముత్యాలు ప్రపంచంలోనే అత్యుత్తమమైన 'బస్రా' ముత్యాలు. ఇక నిజాం ఖిల్వత్ అలంకరణలు కూడా పేరెన్నికగన్నవి. రాజులు ధరించే దస్తార్ (తలపాగా)పై అలంకరించే 'సర్‌పేంచ్'లు ఇవి. వీటిలో వజ్రాలు, పచ్చలు, కెంపులు అత్యంత నైపుణ్యంతో పొదగబడ్డాయి. ఇవేకాక కేవలం పురుషులకే కాకుండా, అంతఃపుర స్త్రీల కోసం రూపొందించిన భారీ కమ్మలు, పట్టీలు, ఉంగరాలు ఇందులోఉన్నాయి. ఒక్కో ఆభరణం వెనుక నెలల తరబడి శ్రమించిన కళాకారుల ప్రతిభ కనిపిస్తుంది.హైదరాబాద్ పౌరులు, చరిత్రకారులు ఈ నగలను శాశ్వతంగా హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో లేదా చౌమహల్లాప్యాలెస్‌లో ఉంచాలని కోరుతున్నారు. నిజాం నగలు ఇక్కడ ఉంటే, హైదరాబాద్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఇవి హైదరాబాద్ గడ్డపై పుట్టినవి. స్థానిక ప్రజలకు తమ పూర్వీకుల సంపదను చూసుకునే హక్కు ఉందని భావిస్తారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కూడా వీటి తరలింపుపై కేంద్రానికి లేఖలు రాశాయి.అయితే వీటి తరలింపులో అనేక చిక్కుముళ్లు ఉన్నట్టి
కేంద్ర మంత్రి పార్లమెంటులో ప్రకటించారు. వీటిని తరలించడం కేవలం ఒక రాజకీయ నిర్ణయం కాదన్నారు. 1995లో రూ. 218 కోట్లకు కొన్న ఈ నిధి ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 50,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇంతటి విలువైన సొత్తును రోడ్డు లేదా విమాన మార్గంలో తరలించడం అత్యంత సాహసోపేతమైన ప్రక్రియ. ఈ నగలను ప్రదర్శించే మ్యూజియంకు గాలి చొరబడని బుల్లెట్ ప్రూఫ్ గ్లాసులు, లేజర్ సెక్యూరిటీ సిస్టమ్స్, ఆర్మ్డ్ ఫోర్సెస్ రక్షణ అవసరం. అంతేకాక ఆర్బీఐ, భారత ప్రభుత్వాల మధ్య ఉన్న పాత ఒప్పందాలను సవరించాల్సి ఉంటుంది.అయితే నిజాం నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను గుర్తిస్తున్నామని కేంద్రం చెప్పడం ఒక ముందడుగు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా హైదరాబాద్‌కు శాశ్వతంగా తరలించలేకపోతున్నామని చెప్పడం పట్ల చరిత్రకారుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. భవిష్యత్తులోసాంకేతికత మరింత అభివృద్ధి చెంది, పటిష్టమైన భద్రతతో ఈ నిధి మళ్లీ భాగ్యనగరంలో ప్రదర్శించబడుతుందని ఆశిద్దాం.

# మంత్రుల ఇళ్ల రిపేర్ కోసం కోటి రూపాయిలా.. అజారుద్దీన్ ఇంటి రిపేర్ కోసం రూ. 76 లక్షలా...

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మంత్రి మహ్మద్ అజారుద్దీన్ అధికారిక నివాసం మరమ్మతుల వ్యవహారం సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా మారింది. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, మరోవైపు మంత్రుల నివాసాల కోసం భారీగా నిధులు వెచ్చించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి .తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్‌కు బంజారాహిల్స్ లోని క్వార్టర్ 29 ను ప్రభుత్వం కేటాయించింది. ఈ ఇంటి పునరుద్ధరణ, మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 76 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. దీనిపై ప్రతిపక్షాలు మండిపడు తున్నాయి.ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, ఈ భవనం గత 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీనివల్ల పైకప్పులు కారడం, ఫ్లోరింగ్ దెబ్బతినడం, విద్యుత్ వైరింగ్ పాడైపోవడం వంటి సమస్యలుఉన్నాయి. వీటిని చక్కదిద్దడానికి వాటర్ ప్రూఫింగ్, టైల్స్ మార్పు, యూపీవీసీ కిటికీలు, ఆధునిక మాడ్యులర్ కిచెన్, పెయింటింగ్ వంటి పనుల కోసం ఈ భారీ మొత్తాన్ని కేటాయించారు. అయితే, ఇదే సమయంలోఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నివాసానికి కూడా మరో రూ. 30 లక్షలు కేటాయించడంతో, గత రెండు వారాల్లో మంత్రుల క్వార్టర్ల కోసమే ప్రభుత్వం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేస్తోందనిస్పష్టమవుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల వల్ల ఖజానా ఖాళీ అయిందని బహిరంగంగానే ప్రకటిస్తూ వస్తున్నారు.రైతు భరోసా, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకు నిధుల సర్దుబాటు చేయడం సవాలుగా మారిన తరుణంలో, మంత్రుల నివాసాల కోసం లక్షలాది రూపాయలు కుమ్మరించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని సూచిస్తోందనిరాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లోనూ అసహనం వ్యక్తం అవుతోంది. సామాన్యుడు పన్నుల రూపంలో చెల్లించే సొమ్మును ప్రజా ప్రయోజనాల కంటే కూడా పాలకుల విలాసాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులు, పాఠశాలల మౌలిక సదుపాయాల కంటే మంత్రుల కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లు ముఖ్యమా? అనే ప్రశ్న తలెత్తుతోంది. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఈ అంశాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తున్నారు. నిధుల కొరత సాకులు చెప్పే ప్రభుత్వం, మంత్రుల విషయంలో మాత్రం ఎందుకు ఉదారంగా వ్యవహరిస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు. 15 ఏళ్లుగా ఒక భవనాన్ని గాలికి వదిలేసి, ఇప్పుడు దానిపై భారీగా వెచ్చించడం ప్రభుత్వ భవనాల నిర్వహణలోని వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది.అయితే ప్రభుత్వం ఈ విమర్శలను కొట్టిపారేస్తోంది. మంత్రులు గౌరవప్రదమైన, సురక్షితమైన నివాసాల్లో ఉండటం కనీస అవసరమని, అవి వ్యక్తిగత ఆస్తులు కావు కాబట్టి ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని నేతలు సమర్థించుకుంటున్నారు. ఎలుకల బెడద, డ్రైనేజీ సమస్యలు,
శిథిలావస్థలో ఉన్న భవనాలను నివాస యోగ్యంగా మార్చడానికే ఈ నిధులు ఖర్చు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.రాజకీయం అంటేనే ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం. ముఖ్యంగా రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పాలకుల జీవనశైలి, ఖర్చులు మరింత పారదర్శకంగా, మితంగా ఉండాలి. ఆడంబరం కంటే అవసరానికే ప్రాధాన్యతనిచ్చినప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది. అజారుద్దీన్ ఇంటి రిపేర్ల వివాదం కేవలం ఒక ఇంటి సమస్య మాత్రమే కాదు.. అది రాష్ట్ర బడ్జెట్ ప్రాధాన్యతలపై జరుగుతున్న పెద్ద చర్చకు సంకేతం. ప్రభుత్వం ఈ విషయంలో ప్రజలకు ఆమోదయోగ్యమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన పద్మ విభూషణ్ నోరి దత్తాత్రేయుడు.. ఆత్మీయ సన్మానం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారానికి డాక్టర్ నోరి ఎంపికైన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. వైద్య రంగంలో, ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అందిస్తున్న అసమానమైన సేవలను సీఎం కొనియాడారు. పద్మభూషణ్ వంటి ఉన్నత పురస్కారం లభించడం తెలుగు జాతికి గర్వకారణమని, ఆయన సేవలు తెలంగాణ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గారు దత్తాత్రేయుడును శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



కే.రామకృష్ణా రావు , డీజీపీ శివధర్ రెడ్డి తదితరులు ఉన్నారు. తెలంగాణను ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా, క్యాన్సర్ నివారణ, చికిత్సపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అందిస్తున్న సూచనలు రాష్ట్రంలోని వైద్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## హార్వర్డ్ యూనివర్సిటీలో రైజింగ్ తెలంగాణ విజన్‌ను చెప్పారు


**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కౌంటర్ ఇచ్చారు. విద్యకు, క్రీడలకు ప్రాధాన్యమిచ్చే రేవంత్ రెడ్డి విద్యార్థులకు, యువతకు ఆదర్శమని, ఏ వయసులోనైనా కొత్తది నేర్చుకోవాలి, చదువుకోవాలంటూ హార్వర్డ్ యూనివర్సిటీ వేదికగా సీఎం మెసేజ్ ఇచ్చే ప్రయత్నం చేస్తే దానిపై కూడా హేళనగా మాట్లాడటం, కేటీఆర్ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. సోమవారం మీడియాతో బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ, హార్వర్డ్ యూనివర్సిటీలో రైజింగ్ తెలంగాణ విజన్‌ను చెప్పి.. అక్కడి మన విద్యార్థులను ఆకట్టుకున్నారని, పదేళ్ల మీరు విదేశాల్లో తిరిగి ఒరగబెట్టింది ఏంటో తెలంగాణ ప్రజలందరికీ తెలుసని విమర్శించారు.సిట్ విచారణకు మాజీ సీఎం కేసీఆర్‌ను పిలిస్తే తెలంగాణ అస్థిత్వాన్ని ముట్టినట్లు అని మాట్లాడిన కేటీఆర్, పదేళ్లు అధికారం ఇస్తే తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసి, రాష్ట్రాని దివాళా తీయించిన రాబందులు మీరు కాదా అని బల్మూర్ వెంకట్ నిలదీశారు. తెలంగాణలోని విద్యార్థులకు, యువతకు స్ఫూర్తి నిచ్చేలా సీఎం కార్యక్రమాలు చేస్తుంటే అభినందించాల్సింది పోయి ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఆయన ఫైర్ అయ్యారు. ఇకనైనా మీ బుద్ధి మార్చుకోకపోతే.. ప్రజలు మీకు మరోసారి సరైన గుణపాఠం చెబుతారని ఆయన మండిపడ్డారు.

# ‘నగ్నసత్యం’పై పరిశోధన జరగాలి: జస్టిస్ సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** తప్పు చేస్తే ఎంతటి వారైనా విచారణ ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో చాడ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ కోసం సర్వం కోల్పోయిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి అని సీఎం గుర్తు చేశారు. ఈ మధ్య తెలంగాణ జాతిపిత అని కొందరు వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారని, ఉద్యమకారులమని వాళ్లే చెప్పుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా? అని అంటున్నారని, తెలంగాణ సమాజానికి అవమానం జరిగిందని ప్రచారం చేస్తున్నారని సీఎం ఎద్దేవా చేశారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేశారని, దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ప్రశ్నించారు. ఆనాడు తలుపులు బద్దలు కొట్టి కోదండరాంను అరెస్టు చేసినప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తేనే ఏదో జరిగినట్లు రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని, పదవులు, వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న వాళ్లు ఉద్యమకారులు ఎలా అవుతారన్నారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకుని.. హుందాగా తప్పుకుంటే కొంతైనా మీ గౌరవం నిలబడేదన్నారు. ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం, ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం, ఇదెక్కడి జాతిపిత లక్షణం అని ప్రశ్నించారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారికి ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారని, శిబు సోరెన్ లాంటి వాళ్లు విచారణ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. మధ్య యుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసేవారని, ఇది ప్రజాస్వామ్య యుగమని, మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేసినవారు విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు.

**నా వల్లే జైపాల్ రెడ్డి ఓడిపోయారుడ**

రాజకీయాల్లో జైపాల్ రెడ్డితో తనకు పెద్దగా సంబంధాలుండేవి కావన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో జైపాల్ రెడ్డి తన వల్లనే 2వేల ఓట్లతో ఓడిపోయారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తర్వాత 2019 లో నిబద్ధత కలిగిన, ప్రశ్నించగలిగిన వారు రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డిని తాను కోరానని గుర్తు చేశారు. ఆ సమయంలో తరం మారింది.. ప్రత్యక్ష రాజకీయాలకు తను దూరం అని, యువతరం రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డి తనను ప్రోత్సహించారని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పును, ప్రజల ఆలోచనని గౌరవించిన గొప్ప నాయకులు




జైపాల్ రెడ్డి, రావి నారాయణరెడ్డి అని సీఎం అన్నారు.

**జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డు దక్కడం సముచితం..**

రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి దక్కడం సముచితమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. తొలి తరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలి తరంలో జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి లాంటి వాళ్లు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తి నింపారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిబద్ధత మోదీని భయపెడుతుందని ఆయనను రాహుల్ గాంధీ ఉపరాష్ట్రపతిగా బరిలో దించారన్నారు.ప్రజలకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని అందించాలనే ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలనకు వ్యతిరేకంగా సుదర్శన్ రెడ్డి ఎన్నికల బరిలో దిగారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందించడం సముచితమని ముఖ్యమంత్రి తెలిపారు.

**రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం కల్పిస్తాం..**

అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆయన పోరాడారన్నారు. బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. దేశంలో మొట్ట మొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డితో నెహ్రూ ప్రారంభింపజేశారని సీఎం తెలిపారు.

అరవై ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణరెడ్డి అన్నారు. ఈ కాలంలో ప్రజలు ఓడించినా కొందరు పదవులు వదులుకోవడానికి సిద్ధంగా ఉండటం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల తరువాత రావి నారాయణ రెడ్డి గారికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు.
సచివాలయంలోఅందరితో సమావేశమై తెలంగాణలో సముచిత గౌరవం కల్పించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**రాజ్యాంగంపై దాడిని తిప్పి కొట్టాలి..**

రాజ్యాంగాన్ని రద్దు చేయడమే బీజేపీ రహస్య ఎజెండా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మోదీ ప్రభుత్వం దేశంలో ఏక పార్టీ, ఏక వ్యక్తి వ్యవస్థను తీసుకువచ్చే కుట్ర చేస్తోందన్నారు. అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదం ఫలించకపోవడంతో రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాయాలని బీజేపీ సర్ ను తీసుకువచ్చిందన్నారు. ఓటు హక్కును కాలరాయాలన్న కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని.. దీనిపై మనమంతా ప్రజల్లో చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. నాణానికి ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు కమ్యూనిస్టులు నిలిచి రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాలని తెలిపారు.

**‘నగ్న సత్యం’పై పరిశోధన జరగాలి: పురస్కార గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

యుగపురుషుడు, ఆదర్శప్రాయుడు రావి నారాయణరెడ్డి రూపొందించిన ‘నగ్న సత్యం’ డాక్యుమెంట్ పై పరిశోధన జరగాలని పురస్కార గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం ఎదురొడ్డి నిలిచిన యోధుడని అన్నారు. తనపై నెహ్రూ రచనలు ఎంతో ప్రభావితం చూపాయని పలుమార్లు రావినారాయణరెడ్డి ప్రస్తావించారని గుర్తుచేశారు. గాంధీ, నెహ్రూ, లోన్ నాయక్ జయప్రకాష్ నారాయణ ఎంత ప్రభావితం చేసినా నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి ప్రతాపరెడ్డి, ట్రస్టు సభ్యులు ప్రభాకర్, పల్లా వెంకట్ రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, రావి ప్రతిభ, రత్నాకర్, సీఎం సలహాదారులు వేంనరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్లతో భారీగా ఆదాయం



**హైదరాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:**తెలంగాణలో భూముల ధరలు భారీగా పెరిగాయి. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లుఅధికారులు తెలిపారు. ఒక్క డిసెంబర్ నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చి చేరినట్లు అధికారులు వెల్లడించారు.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం మరోసారిపుంజుకుంటోంది. హైదరాబాద్ పట్టణంతో పాటు శివారు ప్రాంతాలు, జిల్లాల్లోనూ ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క డిసెంబరు నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారాప్రభుత్వానికి రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటివరకు నమోదైన రాబడిలో మే నెలలో వచ్చిన రూ.1,390 కోట్లు అధికం. తాజాగా డిసెంబరులో ఆ రికార్డును అధిగమించింది. దీంతో స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రికార్డులను కూడా అధిగమించి అత్యధిక రాబడిని నమోదు చేసింది.ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికే రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో అత్యధిక రాబడి 2022-23లో రూ.11,806.34 కోట్లు కాగా.. ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని 144 సబ్ రిజిస్ట్రార్కార్యాలయాల్లో 13.42 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు తెలిపారు. 2022-23లో 16.12 లక్షల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం వచ్చినంత రాబడి అప్పుడురాలేదు.దానికి కారణం భూముల ధరలు తక్కువగా ఉండటం. ప్రస్తుతం భూముల ధరలు భారీగా పెరగడంతోపాటు హైదరాబాద్ శివారు, చుట్టు పక్కల జిల్లాల్లో ఖరీదైన భూముల రిజిస్ట్రేషన్లు అధికమవడమే ఆదాయంపెరగటానికి కారణమని రిజిస్ట్రేషన్ల వర్గాలు చెబుతున్నాయి. నివాస గృహాలు, విల్లాలు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లతోపాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్లో ఇటీవల జరిగిన ఖరీదైన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల కారణంగా రాబడి గతం కంటే పెరిగిఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలతో కూడిన అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను నిర్మిస్తుంది. కొత్త సమీకృత రిజిస్ట్రేషన్ ఆఫీసు భవనాల్లో భూముల రిజిస్ట్రేషన్తో పాటుగా.. వివాహరిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజ్ హాల్స్, గర్భిణులు, పిల్లలు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతం.. తొలిరోజు 95.72 శాతం హాజరు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముగిశాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు 1,41,548 ఉండగా, 6,325 మంది గైర్హాజరు కాగా, మొత్తం 95.72 శాతం హజరు నమోదైనట్లుగా పేర్కొన్నారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు బోర్డు ప్రత్యేక పరిశీలకులను నియమించింది. నిజామాబాద్, కామారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, నాగర్కర్నూల్, వనపర్తి, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జనగామ, హన్మకొండ జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలను వారు సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయని, పరీక్షలు సజావుగా సాగాయని పరిశీలకులు బోర్డుకు తెలిపారు.

# బీ ఫామ్ కోసం బలప్రదర్శనలు

**అదిలాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:** మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్తో పాటు బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి రాజుకుంటుంది. స్క్రూటినీ అనం తరం అభ్యర్థులందరు వార్డుల వారిగా ఎంత మందిబరిలో ఉన్నారు, ఆయా పార్టీల నుం చి ఎంత మంది నామినేషన్లు వేశారు, ఇందు లో పార్టీ బీ ఫారంలు సమర్పించిన వారెందరు, ఇంకా ఎంత మందికి బీ ఫారంలు కావాలి, వారంతా ఇండిపెండెంట్లుగా బరిలో నిలబడితే వార్డులో ఏ కాలనీలోని ఎన్ని ఓట్లు చీల్చుతారు, వారిని తమవైపు తిప్పుకుంటే ఎన్ని ఓట్లు ప్లస్ అవుతాయని అభ్యర్థు లు అంఛనాలు వేయడంతో పాటు సొంత పార్టీలో రెబల్ లను విత్ డ్రా చేయించేందుకు వారి దగ్గరి బంధువులతో, స్నేహితుల తో మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు పెట్టిన ఖర్చుతో పాటు అదనంగా ఫలానా వరకు ఇస్తామని రాయబారాలు నడిపిస్తున్నారు. జిల్లాలో 149 డివిజన్, వార్డులకు 1599 నామినేషన్లు రాగా స్క్రూటినీ అనంతరం 1061 మంది అభ్యర్థులకు చెందిన 1177 నామినేషన్లు ఆమోదం పొందాయి. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లకు 362 మంది అభ్యర్థుల 386 నామినేషన్లు ఆమోదం పొందగా ఇందులో కాంగ్రెస్ నుంచి 77 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుం చి 98, బీజేపీ నుంచి 108, ఆప్ నుంచి 10, బీఎస్పీ నుంచి తొమ్మిది, ఏఐఎంఎం నుంచి రెండు, సీపీఎం నుంచి రెండు, ఇతర పార్టీల నుంచి 44, ఇండిపెండెంట్ల 36 నామినేషన్లు ఆమోదం పొందాయి.అలాగే బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులకు 252 మంది అభ్యర్థుల 279 నామినేషన్లు ఆమోదం పొందాయి. ఇం దులో కాంగ్రెస్ నుంచి 123 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుంచి 81, బీజేపీ నుంచి 27, బీఎస్పీ నుంచి 10, ఏఐఎంఎం నుంచి రెం డు, ఇతర పార్టీల నుంచి 15, ఇండిపెండెంట్ల నుంచి 21 నామినేషన్లకు ఆమోదం లభించాయి, చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులకు 154 మంది అభ్యర్థుల 171 నామినేషన్లు ఆమో దం పొందగా కాంగ్రెస్ నుంచి 56, బీఆర్ఎస్ నుంచి 36, బీజేపీ నుంచి 24, ఆప్ నుంచి ఇద్దరు, బీఎస్పీ, సీపీఎంల నుంచి ఒక్కొక్కటి, ఇతర పార్టీల నుంచి 14, ఇండిపెండెంట్లు 37 నామినేషన్లు ఆమో దం పొందాయి.
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల కు 193 మంది అభ్యర్థుల 241 నామినేషన్లకు ఆమో దం లభిం చగా కాంగ్రెస్ నుంచి 88, బీఆర్ఎస్ నుంచి 53, బీజేపీ నుంచి 33, బీఎస్పీ నుంచి ముగ్గు రు, సీపీఎం నుంచి రెండు, ఇతర పార్టీల నుంచి 29, ఇండిపెండెంట్లు 33 నామినేషన్లు పొం దాయి. అలాగే లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు 100 మంది అభ్యర్థుల నుంచి 100 నామినేషన్లు ఆమో దం పొందగా కాంగ్రెస్ నుంచి 25, బీఆర్ఎస్ నుంచి 32, బీజేపీ నుంచి 25, బీఎస్పీ నుంచి మూడు, సీపీఎం నుంచి మూడు, ఇతర పార్టీల నుంచి నాలుగు, ఇండిపెండెంట్ల 8 నామినేషన్లకు ఆమోదం లభించాయి. జిల్లాలో ఇప్పటి వరకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్రావు మా త్రమే విలేకరుల సమావేశం పెట్టి మంచిర్యాల కార్పొరేషన్తో పాటు లక్షెట్టిపేట మున్సిపాలిటీల కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. ఈ రెండింటిలో ప్రకటించిన అభ్యర్థులు మినహా మిగితా అందరు ఇండిపెండెంటుల కిందకే రానున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీల అభ్యర్థులను ఆయా నియోజక వర్గ ఎంఎల్ఏలు ఇంత వరకు ప్రకటించలేదు.మరో వైపు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం అభ్యర్థుల పేర్లు ప్రకటించాల్సి ఉంది. పార్టీలన్నింటికి బీ ఫారాలు సమర్పించేందుకు ఈ నెల మూడవ తేదీ వరకు సమ యం ఉండటంతో ఆయా పార్టీలు బీ ఫారా లు అందజేసిన అనంతరం పార్టీ గుర్తులపై పోటీలో ఎంత మంది ఉంటారో, స్వతంత్ర అభ్యర్థులుగా ఎంత మంది బరిలో ఉంటా రో తేలనుంది. పార్టీ అదిష్టానం నుంచి ఖచ్చితమైన హామీ తీసుకున్నవారు ప్రచారం చేసుకుంటుండగా ఇప్పటికీ నామినేషన్లు వేసిన చాలా మంది అభ్యర్థులు ఎంఎల్ఏల, పార్టీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. డివిజన్, వార్డుల్లో పోటీలో ఉంటున్న అభ్యర్థులను విత్ డ్రా చేయించేందుకు కార్పొరేటర్, కౌన్సిలర్ పదవి ఆశిస్తున్న వారు శరవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. డివిజన్, వార్డు ఆధారంగా రేట్లు మాట్లాడుకుంటున్నారు. పార్టీలో సంవత్సరాల తరబడి పని చేసినా గుర్తింపునకు నోచుకొని, పార్టీ రెబల్ అభ్యర్థులను కలిసి విత్ డ్రా చేసుకొని మద్దతు ఇవ్వాలని, ఇప్ప టి వరకు పెట్టిన ఖర్చులతో పాటు గుడ్ విల్ గా ఇన్ని లక్షలు ఇస్తామని, సహకరించాలని వేడుకుంటున్నారు. వీరిలో ఎవరు విత్ డ్రా అవుతారో వేచి చూడాల్సిందే.

## దర్శకుడు ఎన్.శంకర్ నివాసానికి కేటీఆర్.. మాతృమూర్తి మృతికి సంతాపం




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రముఖ సినీ దర్శకుడు ఎన్.శంకర్ ) మాతృమూర్తి నిమ్మల సక్కుబాయమ్మ (78) ఇటీవల వృద్ధాప్య సమస్యలతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇవాళ ఆయన హైదరాబాద్లోని శంకర్ నివాసానికి వెళ్లిన కేటీఆర్ సుక్కుబాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం శంకర్ తన తల్లిని కోల్పోవడం ఎవరూ పూడ్చలేని లోటని, ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి భగవంతుడు కొండంత ధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు.డైరెక్టర్, తెలంగాణ ఉద్యకారుడు శంకర్తో కేటీఆర్కు ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ క్రమంలోనే స్వయంగా ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కాగా, నల్గొండ జిల్లాకు చెందిన ఎన్. శంకర్ ఎన్కౌంటర్ సినిమాతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. అనంతరం శ్రీరాములయ్య, జయం మనదేరా, భద్రాచలం, జై బోలో తెలంగాణ వంటి హిట్ చిత్రలను నిర్మించి తెలుగు సినీ పరిశ్రమల్లో తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకున్నారు.

# సౌత్ కు బూస్టప్... కారిడార్లు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, పెన్ పవర్:**

హైదరాబాద్ నుంచి అత్యాధునిక, అత్యంత వేగవంతమైన బుల్లెట్ ట్రైన్లు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏడు హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టుల్ని మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026-27లోప్రకటించింది. ఈ హైస్పీడ్ ట్రైన్ నెట్వర్క్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారనుంది. నగరం నుంచి పుణె, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు హైస్పీడ్ ట్రైన్లు నడవనున్నాయి .హైదరాబాద్ నుంచి పుణె,చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లేవారికి గుడ్న్యూస్. తర్వలోనే ఈ నగరాలకు హైస్పీడ్గా చేరుకోనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్లో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రకటించగా.. అందులోమూడు హైదరాబాద్ నుంచే ఉన్నాయి. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె నగరాలకు ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే.. తెలుగు రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల మధ్య కూడారాకపోకలు వేగవంతమవుతాయి.ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ సీటింగ్ ట్రైన్ల గరిష్ఠ వేగం 150 కి.మీ. కాగా.. త్వరలో ప్రవేశపెట్టనున్న స్లీపర్ ట్రైన్కు ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ ట్రైన్ల గరిష్ఠ వేగం 180కి.మీ. వేగం అందుకుంది. తాజాగా హైస్పీడ్ కారిడార్ ట్రైన్ ప్రాజెక్టులను 350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా డిజైన్ చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు ఎక్స్ప్రెస్ ట్రైన్లలోచేరుకునేందుకు 12-15 గంటల సమయం పడుతుండగా.. హైస్పీడ్ కారిడార్ కార్యరూపం దాలిస్తే 3 నుంచి 3.5 గంటల్లోనే ఆయా నగరాలకు చేరుకోవచ్చు.హైస్పీడ్ కారిడార్లో హైదరాబాద్ నుంచి ఖమ్మం,కర్నూలు వంటి నగరాలకు గంట సమయంలోనే చేరుకోవచ్చు. ఏపీ రాజధాని అమరావతికి సుమారు 75 నిమిషాలు, అనంతపురం పట్టణానికి 90 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా.. చిన్ననగరాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లోనూ స్టాపేజీలను గుర్తించారు. తెలంగాణలో నార్కట్పల్లి, వనపర్తి రోడ్డు, శంషాబాద్ వంటి పట్టణాలతో పాటుగా.. సూర్యాపేట, మహబూబ్నగర్, ఖమ్మం వంటి జిల్లా కేంద్రాల్లోనూ ఈ ట్రైన్లుఆగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని చీరాల, కావలి, గూడూరు వంటి పట్టణాల్లోనూ ఈ ట్రైన్లకు అనుగుణంగా స్టేషన్లు నిర్మించనున్నారు. ప్రస్తుత రైల్వేలైన్లతో సంబంధం లేకుండా కేవలం వీటి కోసమే కొత్తగా ట్రైన్ లైన్లు నిర్మిస్తారు.కీలకదశలోతుది ఎలైన్మెంట్హైదరాబాద్-పుణె హైస్పీడ్ కారిడార్ జహీరాబాద్, కలబురిగి, శోలాపూర్, పంధార్పూర్, ద
అక్లుజ్, దౌడ్, పుణె, స్టేషన్లలో ప్రతిపాదించారు.హైదరాబాద్-చెన్నై ఎలైన్మెంట్ను శంషాబాద్, నార్కట్పల్లి, సూర్యాపేట, ఖమ్మం నుంచి ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపాదిం చింది .హైదరాబాద్-బెంగళూరు మార్గంలో శంషాబాద్, మహబూబ్నగర్, వనపర్తి రోడ్ మీదుగా రైల్వేశాఖ ప్రతిపాదించింది.తాజా ప్రాజెక్టులతో హైదరాబాద్కు చెన్నై, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలతోపాటు.. పుణె,ఖమ్మం, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, అమరావతి, కర్నూలు, కలబురిగి, శోలాపూర్ వంటి నగరాలకు వేగవంతమైన ట్రైన్ కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. అయితే భూసేకరణ చిక్కులు, రూ.లక్షల కోట్ల వ్యయంవంటి అంశాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు చాలా ఏళ్లు పట్టే అవకాశాలున్నాయి.

# చలి తగ్గిందనుకుంటుంటే.. మళ్లీ పెరుగుతుందిగా




**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఉష్ణోగ్రతలు గతం కంటే కొంత పెరిగినప్పటికీ చలి పూర్తిగా కనుమరుగు కాలేదు. శివరాత్రి వరకూ ఇదే పరిస్థితి ఉంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. సాయంత్రం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. అలాగే తెల్లవారు జామున మాత్రం కొంత చలి వాతావరణం కనిపిస్తుంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. అయితే ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో డబుల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

**చలి పూర్తిగా ...**

ఆంధ్రప్రదేశ్ లో చలి పూర్తిగా కనుమరుగయింది. ఉక్కపోత వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు కూడా గరిష్ట స్థాయికి చేరుకుంటున్నాయి. అనేక ప్రాంతాల్లో ముప్ఫయి నుంచి ముప్ఫయి రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అమరావతి వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పొగమంచు అక్కడక్కడా అలుముకుంటుందని, ఏజెన్సీ ప్రాంతంలో మాత్రం కొంత చలి వాతావరణం నెలకొంది. దీంతో పాటు తీర ప్రాంతంలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయని, రాయలసీమలోనూ కొంత ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని చెప్పారు.

**తెలంగాణలో పెరుగుతున్న...**

తెలంగాణలో చలితీవత్ర చాలా వరకూ తగ్గింది. జనవరి నెల వరకూ చలి తీవ్రత ఎక్కువగానే ఉంది. అనేక ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కానీ నేడు మాత్రం డబుల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రధానంగా హైదరాబాద్ లో కూడా భానుడి భగభగలు కనిపిస్తున్నాయి. అయితే తెల్లవారు జామున, రాత్రి వేళ మాత్రమే కొంత చలి వాతావరణం కనపడుతుందని, పగటి వేళల్లో ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# కొత్త రకం క్రెడిట్ కార్డ్ మోసం.. IRCTCలో టిక్కెట్స్ బుక్ చేయగానే రూ.42వేలు మాయం.. ఏమైందంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:** డిజిటల్ చెల్లింపులు పెరిగేకొద్దీ కేటుగాళ్ల మోసాలు కూడా సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. తాజాగా ఒక యువతి తన తండ్రి ఎదుర్కొన్న క్రెడిట్ కార్డ్ మోసం గురించి ఎక్స్ ఖాతాలో పంచుకున్న స్టోరీ ఇప్పుడు బ్యాంకింగ్ రంగంలోని భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది. కేవలం ఒక రాత్రిలో ఫోన్ హ్యాక్ అవ్వడం, వేల రూపాయలు మాయమవ్వడం చూస్తుంటే సామాన్యులకు ఫైనాన్షియల్ సేఫ్టీ ఎక్కడ ఉందనే ప్రశ్న తలెత్తుతోంది.ఇషికా కేసర్వానీ అనే యువతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె తండ్రి మొబైల్ ఫోన్ అర్ధరాత్రి సమయంలో హ్యాక్ అయినట్లు కనిపించింది. వరుసగా ఓటీపీ అలర్ట్‌లు వస్తూనే ఉన్నాయి. తెల్లారి చూసేసరికి ఆయన =దీూ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ నుంచి రూ.42వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు కార్డును బ్లాక్ చేశారు. తీరా ఆరా తీస్తే.. ఆ డబ్బుతో ఫ్లిప్‌కార్ట్ ద్వారా 'ప్లేస్టేషన్ గిఫ్ట్ కార్డ్స్' కొనుగోలు చేసినట్లు తేలింది. మోసం జరిగిన గంటల్లోనే బ్యాంకుకు, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేసినా.. బ్యాంక్ అధికారులు మాత్రం ఇది తమ పరిధిలోకి రాదని, రికవరీ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. దీంతో విసిగిపోయిన ఇషికా సోషల్ మీడియాను ఆశ్రయించింది. ఆమె పోస్ట్ వైరల్ అవ్వడంతో బ్యాంక్ సోషల్ మీడియా టీమ్ వెంటనే స్పందించి.. ఫిబ్రవరి 27 లోపు డబ్బు రీఫండ్ చేసేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చింది. ఒకవేళ తన పోస్ట్ వైరల్ కాకపోయి ఉంటే.. బ్యాంక్ తన ఫిర్యాదును పట్టించుకునేదే కాదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సామాన్యుల ఫిర్యాదులపై బ్యాంకులు చూపుతున్న ఉదాసీనతకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

ఈ సైబర్ మోసంపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నెటిజన్లు స్క్రీన్ మిర్రరింగ్ లేదా కాన్ఫరెన్స్ కాల్ ద్వారా ఫోన్‌ను యాక్సెస్ చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే ఇషికా మాత్రం తన తండ్రి ఎటువంటి అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయలేదని, ×=ఙజలో టికెట్ బుక్ చేసిన వెంటనే ఇలా జరిగిందని ఆమె వెల్లడించారు. దీంతో డిజిటల్ యుగంలో మన కార్డులు ఎంత సేఫ్ అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారుతోంది. కార్డులపై డైలీ ట్రాన్సాక్షన్ లిమిట్స్ పెట్టుకోవడం, అనవసరమైన యాప్స్ డౌన్లోడ్ చేయకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# నాచారంలో టెన్షన్ టెన్షన్.. బీఆర్ఎస్, బీజేపీ లీడర్ల మధ్య కొట్లాట



**హైదరాబాద్ పెన్ పవర్:** నాచారంలో బీఆర్ఎస్, బీజేపీ లీడర్ల మధ్య ఘర్షణ జరిగింది. బీజేపీ నేతపై బూతులు తిడుతూ బీఆర్ఎస్ కార్పొరేటర్ భర్త ప్రవర్తించాడు. నాచారంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ భర్త సాయిజెన్ శేఖర్ బీజేపీ లీడర్ గోపాల్ గౌడ్‌ఎపై దౌర్జన్యం చేశాడు. నాచారం రైతు బజారులోని పబ్లిక్ బోర్ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది.

ముందుగా తనపై దాడి చేశాడని సాయిజెన్ శేఖర్ ఆరోపించారు. నాచారం పోలీస్ స్టేషన్‌శ్రీలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇద్దరి మద్దతుదారులు రోడ్డెక్కి బాహాబాహీకి దిగడంతో నాచారంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి గొడవను సద్దుమణిగేలా చేశారు.

# హైదరాబాద్ నుంచి గోవా వెళ్లే ప్లాన్‌శ్రీలో ఉన్నారా..? అయితే ఓ గుడ్ న్యూస్




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఆర్టీసీ హైదరాబాద్ నుంచి గోవాకు టూర్ ప్యాకేజ్ ప్రకటించింది. ఫిబ్రవరి 25, 2026 న దీఎజూ లింగంపల్లి నుంచి బయల్దేరే బస్సు.. కుక్కే సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, ఉడిపి, మురుడేశ్వర్ ఆలయం మీదుగా గోవా వెళ్లి, తిరుగు ప్రయాణం 01/03/2026న ఉదయం 6 గంటలకు బయలుదేరి గోవా నుంచి వీ+దీూ మీదుగా లింగంపల్లి వస్తుంది. ఈ సర్వీస్‌ఎకు ప్రయాణ రుసుము 5130 రూపాయలు. ప్రయాణీకులు టికెట్ బుకింగ్ కోసం www.tgsrtcbus.in ఓపెన్ చేసి టికెట్ బుక్ చేసుకోవచ్చని TG RTC తెలిపింది. ఈ బస్ సర్వీస్ నెంబర్ 97788. ఇప్పటికే ఈ విషయం తెలిసిన కొందరు టికెట్లు బుక్ చేసుకున్నారు.

గోవా వెళ్లే వారికే కాదు ఈ లోపు పుణ్య క్షేత్రాలను దర్శించుకునే భక్తులకు కూడా ఈ టూర్ ప్యాకేజ్ ఉపయోగకరంగా ఉంటుందని TGSRTC తెలిపింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కాంగ్రెస్ ఆరా: కేసీఆర్ కు సింపతీ పెరుగుతుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ప్రస్తుతం మునిసిపల్ ఎన్నికల వేడి రాజుకుంది. ప్రచారం కూడా ప్రారంభించారు. ఈ నెల 11న ఎన్నికల పోలింగ్ కూడా జరగనుంది. ఈ సమయంలో అనూహ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రత్యక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు ఆదివారం విచారించారు. అయితే.. దీనికి ముందు.. ఆయన భావోద్వేగానికి గురయ్యారంటూ.. వార్తలు వచ్చాయి. ఎక్కడైతే.. తెలంగాణ ఉద్యమం కోసం తాను పథక రచన చేశారో.. అక్కడే పోలీసులతో విచారణకు గురికావాల్సి వచ్చిందని కేసీఆర్ భావించారు.

ఇక, సిట్ అధికారులు కూడా.. సుదీర్ఘంగా 5 గంటలకుపైగా కేసీఆర్‌ను విచారించారు. అయితే.. ఈ పరిణామాలు జరుగుతున్న క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చాయి. ఇక, హైదరాబాద్ లో హైడ్రామా చోటు చేసుకుంది. ఎమ్మెల్సీ జహం గీర్ సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలు దేరారు. మొత్తంగా ఆదివారం రాష్ట్రంలో ఒక రకమైన ఉద్రిక్తత నెలకొంది.

ఇక, కేసీఆర్ తన విచారణను పూర్తి చేసుకుని బయటకు వచ్చాక.. కార్యకర్తలకు అభివాదం చేసినప్పుడు.. జై కేసీఆర్ నినాదాలు మిన్నంటాయి. ఈ పరిణామాలను కాంగ్రెస్ పార్టీ నిశితంగా గమనించింది. సిట్ విచారణ నేపథ్యంలో కేసీఆర్‌కు సింపతీ పెరుగుతుందా? వచ్చే ఎన్నికలపై ప్రభావం పడుతుందా? అనే అంశాలపై పార్టీ నాయకులు చర్చించారు. అయితే.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని.. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే.

**కేసీఆర్ వ్యూహం..**

ఇక, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో మరింత గట్టిగా పోరాటం చేయాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. సిట్ విచారణ... బీఆర్ ఎస్ నేతలపై వేధింపులు.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కూ డా ఆయన సూచించారు. ముఖ్యంగా సెంటిమెంటును రాజేసే దిశగా వ్యూహాలు రెడీ చేస్తున్నారు. సిట్ విచారణ అనంతరం.. గంట పాటు ఆయన పార్టీ సీనియర్లతో భేటీ అయ్యారు. వ్యూహాలపై చర్చించారు.

# మోదీ సర్కార్ సవాల్ కు రేవంత్ నిధులు సమీకరణ సాధ్యమేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ ప్రభుత్వానికి ఒక రకంగా సవాల్ విసిరి నట్లయింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర సహాయం దక్కించుకునే విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి సవాల్ విసిరినట్లు కనిపిస్తోంది. ఈ నిధులు అందితే, 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయడంలో కీలకంగా ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడం ఈ ప్రణాళికలో ప్రధాన డ్రైవింగ్ ఫోర్స్‌గా ఉండనుంది. అయితే ఈ నిధుల సమీకరణ తెలంగాణ ప్రభుత్వానికి ఛాలెంజ్ అని చెప్పాలి.

**హై స్పీడ్ రైలు కారిడార్లు...**

హైదరాబాద్ నుంచి విజయవాడ, ముంబయి, బెంగళూరు దిశగా ప్రతిపాదించిన హైస్పీడ్ రైలు కారిడార్లు, డేటా సెంటర్లు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు పన్ను రాయితీలు వంటి చర్యలు 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుకు ఊపునిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ రంగాల్లో హైదరాబాద్ ఇప్పటికే కీలక కేంద్రంగా ఎదుగుతోంది.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతూ, వచ్చే ఐదేళ్ల పాటు ఏటా రూ.లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇంతకాలం ఈ నిధిపై చర్చలు జరిగినా, రాష్ట్రాలకు స్పష్టమైన మార్గదర్శకాలు లేవు. బడ్జెట్ తర్వాతే కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసింది.

**పట్టణ మౌలిక సదుపాయాల్లో...**

గత రెండేళ్లుగా పట్టణ మౌలిక సదుపాయాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ అమలు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ప్రాజెక్టులు ప్రతిపాదించడంలో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో మురుగునీటి వ్యవస్థను రూ.17 వేల కోట్లతో పూర్తిగా ఆధునీకరించడం, గోదావరి జలాలను జంట నగరాలకు తరలించడం, మంజీరా, ఉస్మాన్ సాగర్ నీటి వనరుల పునరుద్ధరణ వంటి ప్రాజెక్టులు ఖజఖీ కింద ప్రతిపాదనలో ఉన్నాయి.

**మూసీ నది ప్రక్షాళనకు...**

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. జంట నగరాలకు గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్ల రుణాన్ని హడ్కో నుంచి ఇప్పటికే ఆమోదించించడంతో పాటు, నావీ కింద అమలు చేయడానికి ప్రైవేట్ భాగస్వామిని కూడా ఎంపిక చేసింది ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కూడా అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు అనుకూలమని అధికారులు భావిస్తున్నారు. తొలి దశ పనులకు రూ.4,500 కోట్లలో 50 శాతం నిధులు ఆసియా అభివృద్ధి బ్యాంక్ అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో మంత్రులకు బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మంత్రులకు బీఫారాలు అందచేశారు. బాగా పనిచేసే వారికి, పార్టీకి తొలి నుంచి కష్టపడిన వారికి బీఫారాలు అందచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంత్రులు నేతలకు రేపు ఉదయం బీఫారాలను అందచేస్తారు. రాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 117మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల ఎన్నిక ప్రక్రియ పూర్తయిన సంగతి తెలిసిందే. అయితే అభ్యర్థులకు పార్టీ గుర్తులు కేటాయించాలంటే వారికి పార్టీ నుంచి బీఫారాలు అందచేయాల్సి ఉంటుంది.అయితే అధికారంలో ఉండటంతో ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తమకు బీఫారాలు అందచేయాలని నేతలపై వారు వత్తిడి తెస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు కూడా బీఫారాలు ఇవ్వడంలో వివక్ష చూపుతారని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ బాధ్యతలను మంత్రులకు అప్పగించారు. ఆ యా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. రెబల్స్ ఎవరూ ఉండకుండా మంత్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులను ఆదేశించారు.

**రెబల్స్ ను తప్పించి...**

స్థానిక నాయకుల ఆలోచనల మేరకు గత పదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని, వారికే బీఫారాలు ఇవ్వాలని, ఒకవేళ ఎక్కువ మంది ఉంటే వారికి తర్వాత కార్పొరేషన్ పదవులు ఇస్తామని నచ్చచెప్పి పోటీ నుంచి తప్పుకునేలా వారిని ఒప్పించాలని రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే ప్రచారంలో కూడా ప్రజా సమస్యలను గుర్తించి వాటిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రజలకు హామీలను ఇవ్వాలని, అలాగే మంత్రులు కూడా నిరంతరం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని, రాష్ట్ర వ్యాప్తంగా 85 శాతం మున్సిపాలిటీలు గెలుచుకుని రావాలని రేవంత్ రెడ్డి మంత్రులను ఆదేశించారు.

# సియోల్ హెచ్చరిక మన రియల్ ఎస్టేట్‌కు పాఠమా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకవైపు హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో అమ్ముడుపోని అపార్ట్‌మెంట్లు, ఖాళీగా నిలిచిపోయిన బిల్డింగులుడ మరోవైపు డిమాండ్ ఉందని చెప్పుకుంటూ ధరలు పెంచాలని కోరుకునే రియల్ ఎస్టేట్ వ్యాపారులు. భారతీయ నగరాల రియల్ ఎస్టేట్ పరిస్థితి ఇదే. ఈ క్రమంలో దక్షిణ కొరియా రాజధాని సియోల్ పరిస్థితి మనకు ఒక హెచ్చరికగా కనిపిస్తోంది.సియోల్‌లో అపార్ట్‌మెంట్ ధరలు వారానికి ఒకసారి పెరుగుతున్నాయి. ఏడాది పొడవునా వరుసగా 52 వారాలు ధరలు పెరిగాయంటే పరిస్థితి ఎంత తీవ్రమో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాలు ఎన్ని కఠిన నిబంధనలు పెట్టినా హోం లోన్లపై ఎంత కట్టడి చేసినా మార్కెట్ మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా దూసుకుపోతోంది. ఫలితం ఏమిటి? ఒక మధ్యతరగతి ఉద్యోగి 30 ఏళ్లు పని చేసి, రిటైర్ అయిన తర్వాత సియోల్‌లో ఉండలేని పరిస్థితి. ఇది అభివృద్ధి విజయమా? లేక విధాన పరాజయమా?సియోల్ జనాభా దాదాపు 93 లక్షలు. విస్తీర్ణం పరంగా చిన్న నగరంలో ఇంత భారీ జనసాంద్రత ఉండటం సహజంగానే రియల్ ఎస్టేట్‌పై ఒత్తిడిని పెంచింది. ముఖ్యంగా యువత ఫ్లాట్ కొనుగోలునే జీవిత లక్ష్యంగా భావించే స్థితికి చేరడం ఆందోళన కలిగించే అంశం. పెళ్లి, కుటుంబం తర్వాత.. ముందుగా ఇల్లు కంపల్సరీగా భావిస్తున్నారు.. ఇది సామాజిక మార్పు మాత్రమే కాదు, ఆర్థిక ఒత్తిడికి ప్రతిబింబం.ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం.. సియోల్ సమస్య ఒక్కరోజులో ఏర్పడింది కాదు. దశాబ్దాలుగా రాజధానికే అభివృద్ధిని కేంద్రీకరించడం.. ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ భౌగోళిక అసమతుల్యత ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలు, ఐటీ కంపెనీలు, టాప్ యూనివర్సిటీలు, అధిక వేతన ఉద్యోగాలు.. అన్నీ ఒకేచోట. ఫలితంగా దేశమంతా రాజధానికే క్యూ కట్టింది. సెజోంగ్ నగరాన్ని పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చేసినా.. సియోల్‌పై ఒత్తిడి తగ్గలేదు.

ఇక లోన్ల విషయానికి వస్తే.. భారతదేశంతో పోలిస్తే సియోల్ చాలా కఠినం. మన దగ్గర ఫ్లాట్ విలువలో 8090 శాతం వరకు లోన్ వస్తే, అక్కడ కేవలం 40 శాతమే. అయినా ధరలు పెరుగుతున్నాయంటే అది డిమాండ్ తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ లాంటి దేశాలు కూడా ఇలాంటి కఠిన విధానాలనే అమలు చేస్తున్నాయి. అయినా సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు.ఇప్పుడు ప్రశ్న మనదే.. భారత నగరాలు కూడా అదే దారిలో నడుస్తున్నాయా? ముంబయి, బెంగళూరు, హైదరాబాద్‌లలో ఒకవైపు వేలాది అపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉండగా, మరోవైపు ధరలు మాత్రం తగ్గడం లేదు. ఇది నిజమైన డిమాండా? లేక స్పెక్యులేషన్‌తో సృష్టించిన బుడగనా? అన్నది అర్థం చేసుకోవాలి.సియోల్ అనుభవం చెబుతున్న పాఠం స్పష్టం.. అభివృద్ధిని ఒకేచోట కేంద్రీకరిస్తే గృహం సాధారణ మనిషికి అందని కలగా మారుతుంది. ధరల నియంత్రణ ఒక్కటే పరిష్కారం కాదు. అభివృద్ధి వికేంద్రీకరణ, ఉద్యోగాల సమాన పంపిణీ, మౌలిక వసతుల విస్తరణ.. ఇవే దీర్ఘకాలిక మార్గాలు.లేదంటే ఈ రోజు సియోల్ కథ మనం వార్తల్లో చదువుతాం. రేపు అదే కథ మన నగరాల సంపాదకీయాల శీర్షిక అవుతుంది.

# క్రీడాస్ఫూర్తికి రాజకీయ సంకెళ్లు.. పాక్ నిర్ణయం ఆత్మాహుతి సదృశమేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ మైదానంలో భారత్–పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే పోరు కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. అది కోట్లాది మంది అభిమానుల భావోద్వేగం, ఐసీసీకి కాసుల వర్షం కురిపించే అతిపెద్ద వేదిక. అయితే 2026 టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలన్న పాకిస్థాన్ ప్రభుత్వ నిర్ణయం ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజకీయ విభేదాలను క్రీడా మైదానంలోకి తీసుకురావడం ద్వారా పాకిస్థాన్ ఒక ప్రమాదకరమైన సంప్రదాయానికి తెరలేపుతోంది.

**ఐసీసీ హెచ్చరిక.. విస్మరించలేని వాస్తవం**

పాక్ నిర్ణయంపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వ్యక్తం చేసిన ఆందోళన సమంజసమే. “నచ్చిన మ్యాచ్‌లే ఆడతాం.. మిగిలినవి బహిష్కరిస్తాం“ అనడం క్రీడా నియమావళికి పూర్తి విరుద్ధం. ఐసీసీ టోర్నీలలో పాల్గొనే ఏ దేశమైనా ఐసీసీ నిబంధనలకు కట్టుబడి ఉండాలి. ప్రభుత్వాల విధానాలను గౌరవించినప్పటికీ క్రికెట్ ఆత్మను దెబ్బతీసే నిర్ణయాలను ఐసీసీ ఉపేక్షించదు. పాక్ తన మొండివైఖరిని కొనసాగిస్తే, అది కేవలం ఆ ఒక్క మ్యాచ్‌కే పరిమితం కాకుండా ఆ దేశ క్రికెట్ భవిష్యత్తునే ప్రమాదంలో పడేస్తుంది.

**పీసీబీకి పొంచి ఉన్న ముప్పు**

ఈ బహిష్కరణ నిర్ణయం వల్ల భారత్‌కు కలిగే నష్టం కంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కోల్పోయేదే ఎక్కువ. ఐసీసీ కఠిన చర్యలు చేపడితే పీఎస్ఎల్ లీగ్ కుదేలవుతుంది. విదేశీ ఆటగాళ్లకు ఎన్వోసీలు నిరాకరిస్తే పాకిస్థాన్ సూపర్ లీగ్ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది. ఐసీసీ నుంచి వచ్చే నిధుల కోత, స్పాన్సర్‌షిప్‌ల ఉపసంహరణ పాక్ బోర్డును దివాలా తీయించవచ్చు. భవిష్యత్తులో మేజర్ టోర్నీలను నిర్వహించే అర్హతను పాక్ కోల్పోయే అవకాశం ఉంది.

**క్రీడలు – దౌత్యం.. ఎటువైపు పయనం?**

2012 నుంచి ద్వైపాక్షిక సిరీస్‌లు లేకపోయినా ఐసీసీ టోర్నీల పుణ్యమా అని భారత్–పాక్ సమరాలు సాగుతూనే ఉన్నాయి. క్రీడలు అనేవి దేశాల మధ్య వారధిగా పనిచేయాలి కానీ అగాధాన్ని పెంచేవిగా ఉండకూడదు. భారత్ తన షెడ్యూల్ ప్రకారం శ్రీలంకకు వెళ్తామని ప్రకటించడం ద్వారా తన పరిణతిని చాటుకుంది. పాక్ కూడా తన మొండితనాన్ని వీడి మైదానంలోకి వస్తేనే క్రికెట్‌కు, ఆ దేశ అభిమానులకు గౌరవం. రాజకీయ నిర్ణయాలు క్రీడల మీద ప్రభావం చూపినప్పుడు నష్టపోయేది క్రీడాకారులు, అభిమానులే. 2026 వరల్డ్‌కప్‌లో భారత్–పాక్ పోరు జరగకపోతే అది చరిత్రలో ఒక నల్లటి మచ్చగా మిగిలిపోతుంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తన ప్రభుత్వంతో చర్చించి వాస్తవ పరిస్థితులను వివరించి ఈ సంక్షోభాన్ని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సభా సమరం: ఏపీ అసెంబ్లీలో పూనకాలే.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు.. ఈ నెల 11 నుంచి ప్రారంభం అవుతున్నాయి. ముహూర్తమే.. సభల అజెండాను స్పష్టం చేస్తోందన్న టాక్ వినిపిస్తోంది. వైసీపీకి కేవలం 11 స్థానాలు మాత్రమే దక్కిన నేపథ్యంలో గత రెండు సార్లుగా కూడా.. కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఈ అంకెను గుర్తు చేసేందుకు.. 11వ తారీకునే సభలను ప్రారంభిస్తోంది. అదే సమయంలో 11 రోజులు నిర్వహించి.. గతంలో సభలను ముగించింది.ఇక, ఇప్పుడు కూడా 11వ తారీకునే సభను ప్రారంభించడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకా రం.. ప్రభుత్వ వర్గాలు చెబుతున్న లెక్కల ప్రకారం.. ఈ నెల 11న ప్రారంభమయ్యే సమావేశాలు కూడా 11 రోజులు నిర్వహించాలని ప్రభుత్వం ప్లాన్ చేసుకున్నట్టు తెలిసింది. ఇదిలావుంటే, ఈ సమావేశాల్లో 2026–27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. తొలుత బడ్జెట్ సమావేశాలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. అయితే.. ఇది ప్రాథమిక అంశం.

కానీ, ఒకింత లోతుగా చూస్తే.. ఈ సమావేశాల్లో పూనకాలు ఖాయమన్న వాదన వినిపిస్తోంది. వైసీపీ సభలో ఉన్నా.. లేకున్నా.. గత నాలుగు మాసాలుగా వైసీపీ చేస్తున్న రాజకీయాలను సభా వేదికగా పెద్ద ఎత్తున చర్చించనున్నారు. తీవ్రస్థాయిలో వైసీపీపై ప్రభుత్వ పక్షం నిప్పులు చెరిగే అవకాశం ఉంది. పీపీపీ విధానాన్ని వైసీపీ వ్యతిరేకించిన నేపథ్యంలో దీనిపై సభలో సీఎం చంద్రబాబు సమగ్ర వివరణ ఇవ్వనున్నట్టు తెలిసింది. అదేవిధంగా శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం సభను కుదిపేయనుంది.

ఇక, తాజాగా అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు.. గతంలో చంద్రబాబును వేధించిన తీరు.. వంటివి మరోసారి సభలో వైసీపీని ఎండగట్టేలా చేయనున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, అమరావతి, పోలవరం ప్రాజెక్టులు.. కేంద్రంతో ఉన్న బంధం.. కూటమి ప్రయోజనాలు.. ఇలా అనేక అంశాలపై సభలో పెద్ద ఎత్తున చర్చించేందుకు ఇప్పటికే కార్యరంగం రెడీ అయిందని తెలుస్తోంది. సో.. మొత్తం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూనకాలేనని అంటున్నారు టీడీపీ నాయకులు.

# బుర్జ్ కలీఫాను తలపిస్తున్న బంగారం, వెండి ధరల మార్పు..




**హైదరాబాద్ పెన్ పవర్:** పెట్టుబడిదారులకు అత్యంత సురక్షితమైన మార్గంగా భావించే బంగారం, వెండి మార్కెట్లు ప్రస్తుతం ఊహించని కుదుపులకు లోనవుతున్నాయి. 2026 జనవరి చివరి వారంలో చోటుచేసుకున్న విపరీతమైన ధరల మార్పులు చూస్తుంటే, ట్రేడింగ్ చార్టులు అచ్చం దుబాయ్ లోని అత్యంత ఎత్తైన బుర్జ్ ఖలీఫా భవనాన్ని పోలి ఉండటం గమనార్హం. ఒకేసారి నిలువుగా పెరిగి, అంతే వేగంతో పడిపోయిన ఈ ధరల గ్రాఫ్ ఇప్పుడు సోషల్ మీడియాలో డార్క్ హ్యూమర్‌తో కూడిన మీమ్స్‌కు దారితీస్తోంది. గ్లోబల్ మార్కెట్‌లో చోటుచేసుకున్న ఈ ఆర్థిక అలజడిపై మనము ఓ లుక్ వేద్దాం..

**ఆకాశమే హద్దుగా పెరిగి.. అంతే వేగంగా పతనం:**

ట్రేడింగ్ పరిభాషలో బుర్జ్ ఖలీఫా ప్యాటర్న్ అంటే ఒక భారీ ఊహాజనిత బుడగ (ాజూవఎబశ్రీఫ్‌అజవ దీబఎఎశ్రీవ) ఒక్కసారిగా పేలిపోవడం. తాజాగా బంగారం, వెండి ధరల చార్టులు సరిగ్గా ఇలాగే కనిపిస్తున్నాయి. ఇక ధరలు రాకెట్ వేగంతో పైకి దూసుకుపోయి, మరు క్షణమే నిలువుగా కిందకు పడిపోయాయి. ఈ దృశ్యం ప్రపంచంలోనే ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫా ఆకారాన్ని తలపిస్తోంది. సాధారణంగా మార్కెట్ మెట్లు ఎక్కినట్టుగా నెమ్మదిగా పైకి వెళ్లి, లిఫ్ట్ లాగా వేగంగా కిందకు పడుతుంది అంటారు. కానీ ఈసారి వెండి, బంగారం ధరలు అటు పైకి వెళ్లడం, ఇటు కిందకు రావడం రెండూ ఎలివేటర్ వేగంతోనే జరిగిపోవడంతో ఇన్వెస్టర్లు కోలుకోలేకపోయారు.

**వెండి మార్కెట్‌లో భారీ విధ్వంసం:**

ఇక ఈ ఆర్థిక సంక్షోభం తీవ్రత ఎంతలా ఉందంటే, కేవలం 36 గంటల వ్యవధిలో వెండి ధరలు దాదాపు 26 శాతం పడిపోయాయి. దీనివల్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో సుమారు 1.8 ట్రిలియన్ డాలర్ల సంపద తుడిచి పెట్టుకుపోయిందని తాజా ఆర్థిక నివేదికలు చెబుతున్నాయి.ముఖ్యంగా గరిష్ట ధరల వద్ద (అంటే బుర్జ్ ఖలీఫా శిఖరం లాంటి స్పైర్ వద్ద) వెండి కొనుగోలు చేసిన సామాన్య రిటైల్ ఇన్వెస్టర్లు ఈ భారీ పతనంతో సర్వస్వం కోల్పోయి విలవిలలాడుతున్నారు. మార్కెట్ నియంత్రణ లేని ఊహాగానాలు ఎంత ప్రమాదకరమో ఈ గ్రాఫ్ కళ్ళకు కట్టినట్లు చూపిస్తోంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఇన్‌స్టాగ్రామ్ లోని ఫోటో కేవలం ఒక ఫన్నీ మీమ్ మాత్రమే కాదు, ఇన్వెస్టర్లకు ఇదొక గట్టి హెచ్చరిక. మార్కెట్ పరుగులు తీస్తున్నప్పుడు అత్యాశతో పెట్టుబడులు పెట్టడం ఎంతటి నష్టాన్ని తెస్తుందో ఇప్పుడు నిరూపించింది. బంగారం, వెండి లాంటి విలువైన లోహాల విషయంలో కూడా అప్రమత్తత అవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# 77 ఏళ్ల స్వతంత్ర దేశంలో తొలిసారి ఇండజనస్ రాగం.. ఏంటిది?



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశానికి స్వతంత్రం సిద్ధించిన 77 ఏళ్లలో తొలిసారి స్వదేశీ ప్రయోజనాలకు పూర్తిస్థాయిలో పెద్దపీట వేసిన ఏకైక బడ్జెట్‌గా తాజాగా ప్రవేశ పెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ నిలిచిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. గత 76 సంవత్సరాలుగా.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తీరుతెన్నులు గమనిస్తే.. రాష్ట్రాలను మచ్చిక చేసుకునేందుకు.. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ప్రజలను తమ వైపు తిప్పుకొనేందుకు అనేక ప్రయత్నాలు సాగాయి.తద్వారా మూల ధన వ్యయం.. అంటే... ఆదాయం వచ్చే పరిశ్రమలు, రంగాలకు.. భారీ ప్రోత్సహకాలను ఇవ్వకుండా.. ప్రజాకర్షక పథకాలకు పెద్దపీట వేశారు. అనేక పథకాలతోపాటు.. ఆయా ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు కేటాయింపులు పెంచుతూ పోయారు. ఈ క్రమంలోనే ఈ దఫా ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఉండడంతో ఆయా రాష్ట్రాల మెప్పు కోసం.. ప్రజలను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో విన్యాసాలు ఉంటాయని ముందుగా అంచనా వేసుకున్నారు.

కానీ, అంతర్జాతీయ పరిణామాలు, ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చూపిస్తున్న సుంకాల ప్రభావం వంటివి దేశంపై బలంగా కనిపిస్తున్నాయి. జైళి, ఆక్వా, ఐటీ రంగాలకు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వీటిని ముందుగా అంచనా వేయలేని దేశాలు.. ఇప్పుడు ఇరుకున పడుతున్నాయి. నేపథ్యంలో కేంద్రం ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని.. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది. ఇదేసమయంలో వృత్తి విద్య, చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది.

ఇదే సమయంలో ప్రస్తుతం ఇబ్బందిగా ఉన్న విదేశీ మారక ద్రవ్యాన్ని పెంచుకునేందుకు వారసత్వ పర్యాటక ప్రాంతాలు, ప్రధానంగా ప్రపంచ దేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు బౌద్ధ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇక, మూల ధన వ్యయాన్ని 1 శాతం పెంచడం ద్వారా..(11.2 శాతం నుంచి 12.2 శాతానికి పెంచి) రాబడి మార్గాలను వెతుక్కుంది. ఇలా మూల ధన వ్యయం పెరిగిన ఇటీవల బడ్జెట్‌లలో ఇదే తొలిదని.. తద్వారా దేశానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# దాడి చేసే చోట.. స్టేషన్ లోనూ.. హాస్పటల్ లోనూ మేమే... బైరెడ్డి మార్క్ వార్నింగ్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో రాజకీయం.. రాజకీయం దాటి అన్నట్లుగా గత కొన్ని రోజులుగా పరిస్థితి మారిపోయిన సంగతి తెలిసిందే. సాధారణంగా ఉండే రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శల మాటున ఇప్పుడు బూతుల పంచాంగాలు.. ఫలితంగా పెట్రోల్ బాంబులు, వాహనాల ధ్వంసాలు, నివాసాలకు నిప్పులు వంటి టాపిక్స్ తెరపైకి వస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఇది సరైన ఆలోచనలు కాదని అంటున్న వేళ.. తాజాగా ఈ విషయంపై పెట్రోల్ పోసే పనికి పూనుకున్నారు బైరెడ్డి సిద్ధార్ రెడ్డి!అవును... రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడం.. అధికారాన్ని అధికారికంగా కాపాడుకోవడం.. ప్రజల మన్ననలు నిజాయితీగా పొందడం.. వారిని అభివృద్ధి చేయడం స్థానే.. పార్టీల పేరు చెప్పో, కులాలు, మతాల పేరు చెప్పో విద్వేషాలు రెచ్చ గొట్టడం గొప్పగా మారిపోయిన పరిస్థితి. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా రగులుతున్న అగ్నిలో నెయ్యి పోసేలా అన్నట్లుగా వ్యాఖ్యానించారు బైరెడ్డి సిద్ధార్ రెడ్డి. తాజాగా ఈ వ్యాఖ్యలు వైరల్ గా మారాయి.వైసీపీ తలపెట్టిన పాప ప్రక్షాళన పూజల కార్యక్రమం ఏపీలో తీవ్ర ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే.

ఇందులో భాగంగా.. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడం.. దేవాలయాల్లో పూజలు చేయడం వంటి కార్యక్రమాలకు తెర తీశారు వైసీపీ నేతలు. ఈ క్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమవ్వగా.. తదనంతర పరిణామాలు తీవ్ర రూపం దాల్చాయి.. జోగి రమేష్ కు ఎఫెక్ట్ తగిలిన పరిస్థితి!ఈ పరిణామాల నేపథ్యంలో బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి స్పందించారు. ఇందులో భాగంగా... ఇదే పరిస్థితులు రేపు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రిపీట్ అయితే మీరు తట్టుకోగలుగుతారా అని ప్రశ్నించిన సిద్ధార్థ్ రెడ్డి... దాడి చేసే ప్రదేశంలోనూ తామే ఉంటామని, భయపడి పోలీస్ స్టేషన్ కు పారిపోతే అక్కడా తామే ఉంటామని, గాయాలతో హాస్పటల్ కు పోతే అక్కడా తామే ఉంటామని, చివరికి నిద్రపోయినప్పుడు కలలో కూడా తామే ఉంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా చర్యకు ప్రతి చర్య కచ్చితంగా ఉంటుందంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దీంతో.. అంబటి రాంబాబు అసభ్యకర వ్యాఖ్యలకు గానూ ఆయన నివాసంపై దాడి.. జోగి రమేష్ అభ్యంతరకర వ్యాఖ్యలు ఆయన ఇంటిని నిప్పు పెట్టండం వంటి పరిణామాల నేపథ్యంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. దీంతో.. భవిష్యత్తులో ఏపీలో ఎలాంటి పరిస్థిఉలు నెలకొంటాయనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# గల్లా మాధవి @ చంద్రబాబుపై స్కై రేంజ్ అభిమానం...!



**హైదరాబాద్ పెన్ పవర్:** గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేగా తొలిసారి విజయం దక్కించుకున్న గల్లా మాధవి.. తాజాగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుపై తనకు ఉన్న అనంత అభిమానం చాటుకున్నారు. పార్టీ తరపున ఏ చిన్న వచ్చినా.. ఎలాంటి సమస్య ఎదరైనా నేనున్నానంటూ.. కొందరు నాయకులు ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలకు సరైన కౌంటర్లు ఇవ్వాలని.. ఆ పార్టీ లేవనెత్తుతున్న అంశాలపై ధీటుగా స్పందించాలని సీఎం చంద్రబాబు పదే పదే చెబుతున్నారు.అయితే.. కొందరు నాయకులు వింటున్నారు. మరికొందరు నాయకులు తెరమీదికి ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో ఎమ్మెల్యే గల్లా మాధవి ఓ మహిళా ఎమ్మెల్యేగా రెచ్చిపోయారు. చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. పెద్ద ఎత్తున ఉద్యమించారు. తెలుగు మహిళల విభాగం కార్యకర్తలను వెంటబెట్టుకుని అంబటి రాంబాబు కార్యాలయాన్ని ముట్టడించారు. అంతేకాదు.. అంబటికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.ఒక్క గల్లా మాధవే కాదు.. ఆమె భర్త రామచంద్రరావు కూడా.. ఈ నిరసనలో తన వంతు పాత్ర పోషించారు. అంబటి కార్యాలయాన్ని చుట్టుముట్టారు. బేషరతుగా అంబటి సీఎం చంద్రబాబుకు.. క్షమాపణలు చెప్పాల్సిందేనని తేల్చి చెప్పారు. అంతేకాదు.. కార్యకర్తలను కూడా మాధవి ముందుండి నడిపించారు. కష్టకాలంలో టీడీపీ ఎలా స్పందిస్తుంది ? కార్యకర్తలు ఎలా రియాక్ట్ అవుతారు ? అనే విషయాలను ఆమె స్పష్టం చేశారు. దీంతో గుంటూరులో పెద్ద ఎత్తున టీడీపీ ఏకతాటిపైకి వచ్చింది.ఈ పరిణామాలు.. రాష్ట్ర వ్యాప్తంగా కూడా దావాలనంలా వ్యాపించాయి. పెద్ద ఎత్తున చంద్రబాబుకు మద్దతుగా కార్యకర్తలు రోడ్డెక్కారు. గతంలో కూడా చంద్రబాబుపై కేసునమోదై.. ఆయన జైలుకు వెళ్లినప్పుడు.. హుటాహుటిన ఇంత పెద్ద స్పందన రాకపోవడం గమనార్హం. రెండు రోజుల తర్వాత కానీ.. పార్టీ కార్యకర్తలు స్పందించలేకపోయారు. కానీ, తాజాగా మాత్రం ఎమ్మెల్యే గల్లా మాధవి చొరవ తీసుకుని అడుగులు వేయడం.. పార్టీ కార్యకర్తలతో కలిసి ఉద్యమించడం ద్వారా.. పార్టీ విషయంలో ఆమెకు ఉన్న నిబద్ధత, బాబుపై ఉన్న అభిమానాన్ని చాటిందని అంటున్నారు పరిశీలకులు.

# ఆర్థిక మంత్రి చీరపై చర్చ : విధానం ముఖ్యం... వస్త్రధారణ కాదు!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో 'కేంద్ర బడ్జెట్' అనేది కేవలం అంకెల గజిబిజి కాదు.. అది కోట్లాది మంది సామాన్యుల ఆశల ప్రతిబింబం.. దేశ ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచి. అయితే దురదృష్టవశాత్తూ గత కొన్నేళ్లుగా బడ్జెట్ రోజున చర్చలు ఆర్థిక లోటు లేదా ద్రవ్యోల్బణం చుట్టూ కాకుండా ఆర్థిక మంత్రి ధరించిన 'చీర' చుట్టూ తిరగడం మన రాజకీయ పరిణతిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటీవల నిర్మలా సీతారామన్ వ్యక్తం చేసిన అసహనం కేవలం ఒక వ్యక్తిగత స్పందన కాదు.. అది మన సమాజంలోని లింగ వివక్షతపై సంధించిన అస్త్రం.

**లింగ వివక్షతకు అద్దం పడుతున్న వస్త్రధారణ చర్చ**

నిర్మలా సీతారామన్ అడిగిన ప్రశ్న సూటిగా ఉంది. "బడ్జెట్‌ను ప్రవేశపెట్టేది పురుష మంత్రి అయితే ఆయన వేసుకున్న సూటు లేదా కుర్తా గురించి చర్చించేవారా?" ఈ ఒక్క మాట మన విశ్లేషణల్లో ఉన్న ద్వంద్వ ప్రమాణాలను ఎండగట్టింది. పురుష నాయకుల విషయంలో వారి నిర్ణయాలు, విధానాలు విశ్లేషణకు గురవుతాయి. కానీ ఒక మహిళా నాయకురాలు అత్యున్నత పదవిలో ఉన్నా ఆమె నైపుణ్యం కంటే ఆమె వేషధారణే వార్తల్లోకి రావడం మీడియా, సమాజం యొక్క పితృస్వామ్య దృక్పథానికి నిదర్శనం.

**సంకేతాల వెతుకులాట.. ఒక వ్యసనం**

ఆమె కట్టుకున్న కాంచీపురం చీరకు రాజకీయ రంగు పులమడం, దానిని ఎన్నికల వ్యూహంగా అభివర్ణించడం విశ్లేషకుల అతివాదానికి పరాకాష్ట. ప్రతి ఏటా ఆమె దేశీ నేత కార్మికులను ప్రోత్సహించేలా చేనేత వస్త్రాలను ధరించడం అభినందనీయం. అయితే దానిని ఒక 'ఫ్యాషన్ స్టేట్‌మెంట్'గా మార్చి బడ్జెట్‌లోని కీలక కేటాయింపులను పక్కన పెట్టడం ప్రజాస్వామ్యానికి చేటు. అధికారం ఉన్న మహిళను "ప్రతినిధి"గా చూడకుండా ఒక "ప్రదర్శన వస్తువు"గా పరిగణించే ధోరణి మారాలి.

**చర్చ మారాలి.. దృష్టి కోణం మారాలి**

బడ్జెట్ అంటే సామాన్యుడి పళ్లెంలో ఆహారం, మధ్యతరగతిపై పన్నుల భారం, యువతకు ఉపాధి అవకాశాలు. వీటిపై జరగాల్సిన మేధోమథనం, చీర రంగు లేదా డిజైన్ వంటి అనవసర అంశాల వైపు మళ్లుతోంది. ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు, వ్యవసాయ రంగం సంక్షోభం, పారిశ్రామిక వృద్ధి వంటి అంశాలపై పట్టు సాధించాల్సిన చోట గంటల తరబడి వస్త్రాల గురించి చర్చించడం బాధ్యతారాహిత్యం. మహిళా నాయకులను వారి పనితీరు, మేధస్సు , వారు తీసుకునే నిర్ణయాల ప్రాతిపదికన అంచనా వేసినప్పుడే నిజమైన లింగ సమానత్వం సాధ్యమవుతుంది.దనిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను ఒక హెచ్చరికగా భావించాలి. బడ్జెట్ అనేది దేశ ఆర్థిక ఆరోగ్యాన్ని నిర్ణయించే పత్రమే తప్ప ఫ్యాషన్ షో కాదు. మహిళా మంత్రుల వస్త్రాల మీద చూపే శ్రద్ధను, వారు ప్రవేశపెట్టే విధానాల మీద చూపిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది. వస్త్రధారణపై చర్చలు ఆపి.. విధానాలపై విశ్లేషణలు మొదలైనప్పుడే మన రాజకీయ సంస్కృతి గౌరవప్రదంగా మారుతుంది.

# టేబుల్ వద్దకు వస్తే స్క్రీన్ మారేలా వాటే ఐడియా బాస్

**హైదరాబాద్ పెన్ పవర్:** స్మార్ట్ ఫోన్ల రాకతో జీవనశైలి ఎంతలా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో బోర్ కొడుతోందని.. ఎవరితోనైనా మాట్లాడేందుకు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ఆ అవకాశమే లేదు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. గేమ్స్ మొదలుకొని.. సోషల్ మీడియా వరకు.. వాట్సాప్ నుంచి ఓటీటీలో సినిమాల వరకు నాన్ స్టాప్ గా ఎన్ని గంటలైనా తమకు తాము ఎంగేజ్ అయిపోవటం కామన్ గా మారింది. ఆ అలవాటు కాస్తా వర్కు ప్లేస్ లోనూ కంటిన్యూ అవుతున్న పరిస్థితి.తమ అభిరుచులకు తగినట్లుగా పని మధ్యలో బ్రేకులు తీసుకోవటం.. తమకు నేచ్చిన గేమ్ కానీ ఓటీటీలో సిరీస్ కానీ సోషల్ మీడియాలో కబుర్లు కానీ.. వీడియోలు చూసుకుంటూ పనిని వాయిదా వేసే తీరు అంతకంతకూ ఎక్కువైంది. అదే సమయంలో బాస్ కంట పడి తిట్లు తినే ఉద్యోగుల సంఖ్య తక్కువేం కాదు. అయితే.. ఇలాంటి పరిస్థితిని తప్పించుకోవటానికి బెంగళూరుకు చెందిన ఒక టెకీకి వచ్చిన ఐడియా గురించి తెలిసిన వారంతా ఫిదా అవుతున్నారు. ఇంతకూ అతనికి ఆ ఐడియా రావటానికి కారణం.. తనకు నచ్చిన గేమ్ ఆడుతూ బాస్ కంట పడి తిట్టించుకోవటమే.ఇలా తిట్లు తినే పరిస్థితి రిపీట్ కాకుండా ఉండేందుకు అదిరే ఐడియాతో ఒక డివైజ్ ను తయారు చేశాడు. అదేమంటే.. తన కంప్యూటర్ కు ఏఐ వపర్డ్ కెమెరా డివైజ్ ను అమర్చాడు. ఆ కెమెరా పంకజ్ కూర్చున్న టేబుల్ పరిధిలో ఎవరు వచ్చినా గుర్తించటం.. ఆ వెంటనే కంప్యూటర్ స్క్రీన్ ఇన్ స్టంట్ గా కోడ్ ఎడిటర్ గా మారిపోతుంది. ఏఐ, ఆటోమేషన్, రియల్ టైమ్ ఫేస్ డిటెక్షన్ టెక్నాలజీతో ఈ హార్డ్ వేర్ ను రూపొందించాడు.తనకు వచ్చిన ఐడియాను ఎక్స్ లో పోస్టు చేశాడు. దీనికి లక్షలాది వ్యూస్ రావటమే కాదు.. వాటే ఐడియా బాస్ అంటూ మెచ్చుకుంటున్నారు. తన బాస్ తిట్ల దండకం నుంచి తప్పించుకోవటానికి ఈ హార్డ్ వేర్ డివైజ్ తయారు చేసినా.. ఆఫీసుల్లో ప్రైవసీని కాపాడేందుకు ఇదో స్మార్ట్ సొల్యూషన్ గా ఉపయోగపడుతుందని పంకజ్ చెబుతున్నాడు. ఏమైనా బుర్ర ఉన్నోడి ఆలోచనలు ఎలా ఉంటాయనటానికి ఇదో నిదర్శనంగా చెప్పొచ్చు.

# ఎఫైర్ పై నిలదీసిన మామ.. కోడలు ఎంత పనిచేసిందంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్నిసాక్షిగా వివాహం చేసుకుని పెద్దల సమక్షంలో దాంపత్య బంధంలోకి అడుగుపెట్టి పిల్లలను కని కుటుంబాన్ని కొనసాగించడమే వివాహ వ్యవస్థ యొక్క అసలు లక్ష్యం. కష్టసుఖాల్లో భార్యాభర్తలు ఒకరికి ఒకరు తోడుగా నిలవాల్సిన ఈ పవిత్ర బంధం నేటి సమాజంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. భార్యాభర్తల మధ్య సరైన అవగాహన, పరస్పర గౌరవం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా మారుతోంది.ఈ లోటే వివాహేతర సంబంధాలకు దారితీస్తోంది. మొదట రహస్యంగా మొదలయ్యే ఈ అనైతిక బంధాలు, చివరకు కుటుంబాలను కూల్చివేసే స్థాయికి చేరుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇవి దారుణమైన నేరాలకు, ప్రాణనష్టం జరిగే పరిస్థితులకు కూడా కారణమవుతున్నాయి. ఇటువంటి ఘటనలు ఇటీవల దేశవ్యాప్తంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.అటువంటి షాకింగ్ ఘటన ఒకటి తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. అక్కడ నివసిస్తున్న ఓ మహిళ, తన భర్తకు తెలియకుండా మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం క్రమంగా ఆమె మామకు తెలిసింది. దీంతో ఆయన కోడలిని నిలదీసి ఇది సరికాదని ఇలాంటి వ్యవహారాల వల్ల కుటుంబ పరువు మంటగలిసిపోతుందని హెచ్చరించారు.కానీ తన అక్రమ సంబంధానికి మామ అడ్డుగా మారడంతో ఆ కోడలు తీవ్ర అసహనానికి గురైంది. ఈ విషయాన్ని తన ప్రియుడితో చర్చించిన ఆమె, చివరకు మామను చంపేయాలనే ఘోర నిర్ణయానికి వచ్చింది. ఇందుకు ప్రియుడి సహకారం తీసుకుంది.ప్లాన్ ప్రకారం మామ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో అతనిపై పెట్రోల్ పోసి, వెంటనే నిప్పంటించారు. ఒక్కసారిగా మంటలు చెలరేగి అతని శరీరం మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో అతడికి సుమారు 70 శాతం తీవ్ర కాలిన గాయాలు అయ్యాయి. మంటల తాకిడిని తట్టుకోలేక అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. బైక్ నడపలేని స్థితిలో కొంత దూరం కాలిన శరీరంతోనే నడుచుకుంటూ రావడం అక్కడున్నవారిని భయాందోళనలకు గురిచేసింది.ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ వీడియోలను చూసినవారికి ఒళ్లు గగుర్పొడిచే పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న తమిళనాడు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో బాధితుడి కోడలు, ఆమె ప్రియుడు సహా మరో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసినట్లు తమిళనాడు మీడియా వెల్లడిస్తోంది.

వివాహేతర సంబంధాలు ఎలా ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, సమాజాన్నే వణికించే నేరాలకు దారి తీస్తాయో ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోంది. చిన్న తప్పు అనుకున్న నిర్ణయం, చివరకు ప్రాణాల మీదికి తెచ్చే ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందన్నదానికి ఇది మరో ఉదాహరణగా నిలుస్తోంది.

# ముద్రగడ లేఖకు బుద్ధా కౌంటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో లేఖాస్త్రాలు సాగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముద్రగడ పద్మనాభరెడ్డి లేఖ సంధిస్తే ఆయనకు కౌంటర్ గా టీడీపీ నుంచి బుద్ధా వెంకన్న మరో లేఖ వదిలారు. దీంతో ఈ రెండు లేఖలలోని అంశాలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తున్నాయి. ముద్రగడ పద్మనాభరెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్ కి లేఖాస్త్రం సంధించారు. గోదావరి భాషలో యాసలో ఆయన రాసిన లేఖలో కాపుల గురించి ప్రస్తావించారు. ఏపీలో చంద్రబాబు జమానాలో కాపులను టార్గెట్ చేస్తున్నారు అని ముద్రగడ తీవ్ర ఆరోపణ చేశారు. చంద్రబాబు ఎపుడు సీఎం అయినా ఇదే వైఖరితో సాగుతున్నారు అని ఆయన విమర్శించారు. 2014 నుంచి 2019 మధ్యలో తనను తన కుటుంబాన్ని వేధించిన బాబు ఇపుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీద కూడా ఇదే తీరున వేధింపులు చేస్తున్నారు అని ముద్రగడ లేఖలో పేర్కొన్నారు.

**ఎందుకు ఆగ్రహం :**

కాపుల మీద ఎందుకు చంద్రబాబుకు ఆగ్రహం అని ముద్రగడ ప్రశ్నించారు. కాపులను బీసీలలో చేరుస్తాను అని 2014లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బాబు దానిని నెరవేర్చలేదని దాంతో కాపులు అంతా ఆయన మీద ఆగ్రహంగా ఉన్నారని ముద్రగడ అన్నారు. అయితే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మీద ప్రేమతోనే వారు మరోసారి టీడీపీకి ఓటు వేసి గెలిపించారు అని చెప్పారు. మాజీ మంత్రులు అన్న గౌరవం లేకుండా జోగి రమేష్ విడదల రజనీ అంబటి రాంబాబు వంటి వారి మీద ఈ దాడులు ఏమిటి అని ఆయన ప్రశ్నించారు ఏపీలో రాక్షస పాలన సాగుతోందని ముద్రగడ ఆక్షేపించారు.

**అందరినీ జైలులోనే :**

కేంద్రంతో మాట్లాడి ఏపీలో ఎమర్జెన్సీ పాలన పెట్టించండని, అపుడు ప్రతిపక్ష నాయకులు అందరినీ జైలులో ఉంచేయవచ్చు అని ముద్రగడ సెటైరికల్ గా సలహా ఇచ్చారు. అబద్ధాలు చెప్పకూడదని మా నాన్న మాకు చెప్పేవారు అని ముద్రగడ గుర్తు చేసుకున్నారు ఒక అబద్ధానికి వంద అబద్దాలు చెప్పాల్సి వస్తుందని అన్నారు. అయితే తిరుపతి లడ్డూ విషయంలో చంద్రబాబు అబద్ధాలు చెప్పారని తీరా సీబీఐ ఇచ్చిన నివేదికలో అసలు విషయం బయటపడిందని అందుకే దానిని డైవర్ట్ చేసే ఉద్దేశ్యంతో ఈ రకంగా చేస్తున్నారు అని ముద్రగడ ఆరోపించారు. అయితే చంద్రబాబు ఆ విధంగా కాకుండా తప్పు జరిగింది పొరపాటు అయింది అని ఉంటే ఎంతో గౌరవంగా హుందాగా ఉండేదని ముద్రగడ అన్నారు.

**బుద్ధా కౌంటర్ :**

అయితే ముద్రగడ పద్మనాభరెడ్డి చేసిన కామెంట్స్ లేఖలోని సారాంశం మీద మాజీ ఎమ్మెల్సీ టీడీపీ సీనియర్ నేత బుద్ధా వెంకన్న కౌంటర్ ఇచ్చారు. ముద్రగడకు ఇపుడు కాపు కులం గుర్తుకు వచ్చిందా అని అందులో నిలదీశారు. ఆయనకు అవసరం అయినప్పుడే కులం గురించి మాట్లాడమని ఆయన తండ్రి చెప్పారా అని ఎద్దేవా చేశారు. గతంలో చాలా సందర్భాలలో కాపులను వైసీపీ వేధిస్తే అపుడు ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.

**పవన్ భార్యను తల్లిని :**

వైసీపీ హయాంలో పవన్ భార్యను తల్లిని అవమానించినపుడు ముద్రగడకు కాపులు ఎందుకు గుర్తుకు రాలేదని బుద్ధా వెంకన్న ప్రశ్నించారు. అంతే కాదు మంత్రి నారాయణ మీద తప్పుడు కేసులు పెట్టించి హైదరాబాద్ నుంచి చిత్తూరు దాకా తీసుకెళ్ళినపుడు ఆయన కాపు సామాజిక వర్గం అనిపించలేదా ముద్రగడ గారూ అని నిలదీశారు. చంద్రబాబు భార్యను అసెంబ్లీ లోపలా బయటా నానా మాటలు అన్నపుడు ఇపుడు పలుకుతున్న చిలక పలుకులు నాడు ఎందుకు గుర్తుకు రాలేదని వెంకన్న అడిగారు.

**వాటిని సమర్థిస్తారా :**


మాజీ మంత్రి అంబటి రాంబాబు వాడిన బూతులను సమర్థిస్తారా అని ప్రశ్నించారు. అలాగే జోగి రమేష్ చంద్రబాబు ఇంటి మీద చేసిన దాడికి మద్దతు ఇస్తున్నారా అని ముద్రగడని నిలదీశారు. 1994 ఎన్నికల్లో ఓటమి చెంది ఇంట్లో కూర్చుంటే 1999లో ఎంపీ టికెట్ ఇచ్చి పార్లమెంట్ కి చంద్రబాబు పంపించినపుడు చంద్రబాబు మంచి వ్యక్తి అని చెప్పింది ముద్రగడే కదా అని ఫ్లాష్ బ్యాక్ గుర్తు చేశారు.

**అసూయతో లేఖలు వద్దు :**

వాస్తవాలు తెలుసుకుని లేఖలు రాయండి, అంతే కానీ అసూయతో రాయవద్దు అని బుద్ధా వెంకన్న కోరారు. చంద్రబాబు కులానికో మతానికో ప్రాంతానికో చెందిన వారు కాదని, ఆయన ప్రపంచ నాయకుడని అన్నారు. బాబు మీద ఎవరు అసూయ చెందినా ఆయన అంతకంతకు పెరుగుతారు అన్నది గుర్తు పెట్టుకోవాలని ముద్రగడకు సూచించారు. మొత్తానికి ముద్రగడ బాబుకు రాసిన లేఖ దానికి కౌంటర్ గా బుద్ధా వెంకన్న రాసిన లేఖ రెండూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# రుణ భారతం : ప్రతీ ఒక్కరి తల మీద లక్షన్నర అప్పులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏ బడ్జెట్ చూసినా ఏమున్నది గర్వకారణం. చిట్టా పద్దులు సమస్తం అప్పుల వ్యవహారం అని పాడుకోవాల్సిందే. బడ్జెట్ అన్నది చిత్రంగా ఉంటుంది. రాబడి తక్కువగా ఉంటుంది. అయినా సరే భారీ నంబర్ తో బడ్జెట్ తయారు అవుతుంది. మరి ఇంత సొమ్ము ఎలా వస్తుంది అంటే రకరకాలైన అంచనాలు అందులో తెచ్చి పెడతారు. అయినా సరే అంతరం భారీగా ఉంటుంది. మరి ఆ లోటుని ఎలా పూడుస్తారు అంటే అప్పులు తెచ్చి అన్నది సింపుల్ ఆన్సర్. ఇపుడు కేంద్ర బడ్జెట్ లో చూస్తే అదే పరిస్థితిగా ఉంది. ఏకంగా 17.2 లక్షల కోట్ల అప్పులు 2026-27 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం చేయబోతోంది. బడ్జెట్ ని 53 లక్షల కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టిన తరువాత వచ్చే రాబడులు ఆదాయాలు అన్నీ సరి చూసుకుంటే అప్పులు చేయక తప్పని పరిస్థితి అన్న మాట.




**మోడీ హయాంలో పెరిగింది :**

అప్పులు గత ప్రధానుల హయంలో అంతా కలసి చేసిన అప్పుల కంటే రెట్టింపుగా మోడీ ప్రభుత్వ హయాంలో గత పన్నెండేళ్ళ కాలంలోనే అప్పులు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. దీంతో ఈ దేశంలో ప్రతీ పౌరుడి నెత్తి మీద అప్పు ఉంది. చేతిలో చిల్లి గవ్వ లేదని ఎవరూ చింతించ నక్కరలేదు, ఎందుకంటే అప్పు వారి తలకాయ మీద లక్షల్లోనే ఉంది. ఇంకా అది పెరగబోతోంది కూడా.

**అప్పులు ఎలా తెస్తారు :**

తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తీసుకుంటే 17.2 లక్షల కోట్ల లోటు ఉంది కదా మరి వీటికి ఏ విధంగా అప్పులు తెస్తారు అంటే దానికి ఒక మార్గం ఉంది అంటున్నారు. డేటెడ్ సెక్యూరిటీలు అలాగే ఇతర మార్గాల ద్వారా ఈ అప్పులను సేకరించి తీసుకుని రావాలని కేంద్రం ఆలోచిస్తోందని అంటున్నారు. వచ్చే ఆదాయం అలాగే పెట్టే ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తుంది దాంతో భారీగానే ద్రవ్య లోటు ఉంది దానికి పూడ్చుకునే మార్గాలని కేంద్రం అన్వేషిస్తోంది. ఈ క్రమంలో 11. 7 లక్షల కోట్ల రూపాయలు డేటెడ్ సెక్యూరిటీల ద్వారా సేకరిస్తారని అంటున్నారు. అలాగే చిన్న మొత్తాల పొదుపు, ఇతర రుణాల ద్వారా మిగిలిన ఆరు లక్షల కోట్లను సేకరిస్తారు అని అంటున్నారు.

**నెలకు లక్ష కోట్ల వడ్డీ :**

అప్పులు చేయడం ఎవరికైనా బాగానే ఉంటుంది. కానీ అసలు కంటే ముందు వడ్డీ పట్టి పీడిస్తుంది. ఈ క్రమంలో గత వడ్డీల చెల్లింపు పెను భారంగా మారబోతోంది. నెలకు లక్ష కోట్ల పైనే కేంద్ర ప్రభుత్వం వడ్డీలు కట్టాల్సి వస్తోంది అని అంటున్నారు. ఈ వడ్డీలు అసలు అన్నీ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థ మీద అతి పెద్ద గుది బండగా మారుతున్నాయని అంటున్నారు. ఇక కొత్త ఆర్థిక సంవత్సరంలో వడ్డీలకు కేంద్రం చెల్లించాల్సిన మొత్తం ఎంత అంటే అక్షరాలా 14,03,972 రూపాయలు అని అంటున్నారు. దానిని కనుక నెలకు విభజిస్తే 1.17 లక్షల కోట్ల రూపాయలుగా ఉందని చెబుతున్నారు

**అప్పుల లెక్క ఇదీ :**

ఇక మోడీ ప్రధానిగా 2014లో అయ్యారు. ఆయన కంటే ముందు అంటే గత ఆరున్నర దశాబ్దాల కాలంలో ఎందరో ప్రధానులు ఈ దేశాన్ని ఏలారు వారంతా కలసి చేసిన అప్పులు చూస్తే అక్షరాలా 55,87,147 కోట్ల రూపాయలుగా ఉంది. అంటే సగటున ఏడాదికి 83 వేల కోట్ల అప్పు అన్న మాట. ఇక మోడీ ప్రధాని అయ్యాక చేసిన అప్పు తీసుకుంటే 1,52,85,363 కోట్ల రూపాయలుగా ఉంది. అంటే సగటున నెలకే 1.10 లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు అన్న మాట. ఇంతలా అప్పులు చేస్తూ రుణ భారతాన్ని రచిస్తున్న తీరు మాత్రం ప్రతీ భారతీయ పౌరుడినీ ఆలోచింపచేస్తోంది అన్నది మాత్రం నిజం.

## స్పాట్ మార్కెట్లో ధర తగ్గినా రిటైల్ రేట్లు తగ్గట్లే..! నిజంగానే వెండి రేట్లను తారుమారు చేస్తున్నారా..?




**హైదరాబాద్ పెన్ పవర్:** మార్కెట్‌లో వెండి రేట్లు పెను ప్రకంపనలు సృష్టిస్తూ కేవలం మూడు రోజుల్లోనే ఏకంగా 40 శాతం కుప్పకూలాయి. బంగారం, వెండి కలిపి సుమారు రూ. 830 లక్షల కోట్ల సంపద ఆవిరి చేశాయి. అయితే ఈ పతనం వెనుక వెండికి డిమాండ్ తగ్గడం కంటే.. పేపర్ మార్కెట్ మాయాజాలం మార్కెట్ మానిపులేషన్ ప్రధాన కారణాలుగా ఉన్నాయని నిపుణులు అంటున్నారు. దీని ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై ఎలా ఉంటుంది. రేట్లలో వ్యత్యాసం కొనసాగుతుందా అనే విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

ప్రస్తుతం వెండి స్పాట్ ధర (పేపర్ మార్కెట్) దాదాపు ఔన్సు రేటు79 డాలర్ల వద్ద ఉండగా.. భౌతిక వెండి ధర మాత్రం ఔన్సుకు 101 డాలర్ల వద్ద కొనసాగుతోంది. సాధారణంగా వీటి మధ్య వ్యత్యాసం చాలా తక్కువగా ఉంటుంది. కానీ ఇప్పుడు ఉన్న ఈ భారీ వ్యత్యాసం భౌతిక వెండికి డిమాండ్ ఇంకా బలంగానే ఉందని సూచిస్తోంది. అసలు సమస్య వెండి లభ్యతలో లేదు, వెండిని నమ్ముకుని ఆడే లివరేజ్ ఆటలో ఉందని అంటున్నారు నిపుణులు.

### 1:400 నిష్పత్తి.. అంతులేని పేపర్ సప్లై

మార్కెట్‌లో ఒక ఔన్సు ఫిజికల్ వెండి అందుబాటులో ఉంటే.. దానికి ప్రతిగా సుమారు 400 పేపర్ కాంట్రాక్టులు చలామణిలో ఉన్నాయి. అంటే వెండిని గనుల నుంచి తవ్వాల్సిన పనిలేకుండానే బ్యాంకులు కేవలం కాగితంపై కాంట్రాక్టులను సృష్టించి ట్రేడింగ్ చేస్తున్నాయి. జనవరి 2026 నాటికి కేవలం 113-124 మిలియన్ ఔన్సుల డెలివరీ ఇవ్వదగ్గ వెండి ఉండగా, మార్కెట్‌లో 508 మిలియన్ ఔన్సుల పేపర్ కాంట్రాక్టులు ఉన్నాయి. ఒకవేళ కాంట్రాక్ట్ హోల్డర్లలో ఒక చిన్న శాతం మంది తమకు 'ఫిజికల్ సిల్వర్' కావాలని అడిగితే ఎక్స్ఛేంజీల వద్ద ఇచ్చేందుకు వెండి ఉండదు.

### మార్జిన్ కాల్స్ మానిపులేషన్..

పెద్ద బ్యాంకులు, సంస్థాగత ఇన్వెస్టర్లు తక్కువ పెట్టుబడితో ఎక్కువ మొత్తంలో వెండిని ట్రేడ్ చేయడానికి లివరేజ్ సౌకర్యాన్ని వాడుతుంటారు. ధరలు స్వల్పంగా తగ్గినప్పుడు, తమ పొజిషన్లను కాపాడుకోవడానికి ట్రేడర్లు అదనపు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అలా లేని పక్షంలో ఎక్స్ఛేంజీలు బలవంతంగా ఆ కాంట్రాక్టులను తక్కువ ధరకే అమ్మేస్తాయి. ఇది ధరలను మరింత కిందికి నెట్టివేస్తుంది.

చైనా మార్కెట్లు సెలవులో ఉన్నప్పుడు.. తక్కువ ట్రేడింగ్ జరిగే సమయంలో పెద్ద బ్యాంకులు వెండిని భారీగా డంప్ చేసి ధరలను పడగొట్టాయి. దీనివల్ల సామాన్య రిటైల్ పెట్టుబడిదారులు భయపడి తమ దగ్గరున్న వెండిని అమ్మేస్తారు. ఆ తక్కువ ధర వద్దే మళ్లీ పెద్ద సంస్థలు తమ షార్ట్ పొజిషన్లను క్లోజ్ చేసుకుని లాభపడతాయి.

### మరి వెండి భవిష్యత్తు ఏంటి..?

ప్రస్తుతం వెండి రేట్లలో పతనం కేవలం బలహీనమైన ఇన్వెస్టర్లను బయటకు పంపడానికేనని నిపుణుడు మను రిషి గుప్తా అభిప్రాయపడ్డారు. గత పదేళ్లలో వెండి ధరలను తారుమారు చేసినందుకు పెద్ద బ్యాంకులు 1.3 బిలియన్ డాలర్ల జరిమానా కూడా చెల్లించాయని చెప్పారు. వెండి, బంగారం గత రెండేళ్లలో వరుసగా 270%, 140% లాభాలను ఇచ్చాయి. రాబోయే పదేళ్లలో వెండి ధర ఔన్సుకు 300 నుంచి 500 డాలర్లకు చేరే అవకాశం ఉందని, ప్రస్తుత పతనాన్ని చూసి భయపడి అమ్మేస్తే తర్వాత పశ్చాత్తాపం తప్పదని ఆయన హెచ్చరిస్తున్నారు.

## మీరూ ఇలాగే గోల్డ్ అండ్ సిల్వర్ కొంటున్నారా..? అయితే చివరికి మిగిలేది భారీ నష్టమే ఇన్వెస్టర్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** డబ్బు సంపాదించాలనే కోరిక ఉండటం తప్పు కాదు. కానీ అది దురాశగా మారినప్పుడు ప్రాణాల మీదికి రావడమే కాకుండా ఆర్థిక జీవితం అల్లకల్లోలమవుతుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వ్యక్తి స్టోరీ ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. పెట్టుబడిదారుల అత్యాశ, సరైన అవగాహన లేకపోవడం వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురవుతాయో ఆర్థిక సలహాదారు ఆదిత్య షా లైవ్ ఎగ్జాంపుల్ తన ఎక్స్ అకౌంట్లో షేర్ చేయటంతో అది ఇప్పుడు చాలా మంది గోల్డ్ అండ్ సిల్వర్ ఇన్వెస్టర్లకు కళ్లు తెరిపిస్తోంది.

సాధారణంగా బంగారం, వెండిలను దీర్ఘకాలిక భద్రత కోసం కొనుగోలు చేస్తారు. కానీ ఒక ఇన్వెస్టర్ ఏకంగా తన క్రెడిట్ కార్డు పరిమితిని పూర్తిగా వాడేసి ఏకంగా రూ.10 లక్షల విలువైన బంగారం, వెండిని కొనుగోలు చేశాడు. కేవలం నెల రోజుల్లోనే 10 నుంచి 12 శాతం లాభం వస్తుందని.. ఆ లాభంతో అప్పు తీర్చి మిగిలిన డబ్బు వెనకేసుకోవచ్చని ప్లాన్ చేశాడు. అయితే మార్కెట్ లెక్కలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అంతర్జాతీయ పరిణామాల వల్ల బంగారం ధరలు ఒక్కసారిగా తగ్గడంతో.. ఆ ఇన్వెస్టర్ ఇప్పుడు భారీ నష్టాల్లో కూరుకుపోయాడు. అటు లాభం రాకపోగా, ఇటు క్రెడిట్ కార్డు బిల్లు కట్టడానికి తల ప్రాణం తోకకు వస్తోందట.చాలామంది మధ్యతరగతి పెట్టుబడిదారులు ఇప్పుడు బంగారాన్ని కూడా షేర్ మార్కెట్ లాగానే చూస్తున్నారు. తక్కువ కాలంలో అమ్మేసి లాభాలు సంపాదించాలని చూస్తున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. బంగారం అనేది రెగ్యులర్ గా డబ్బులు ఇచ్చే ఆస్తి కాదు. పైగా అత్యధిక వడ్డీ ఉండే క్రెడిట్ కార్డు అప్పుతో ఇటువంటి ఒడిదుడుకులు ఉండే లోహాలపై బెట్ కాయడం అంటే గోతిలో వారంతట వారే దూకడం లాంటిది అంటున్నారు నిపుణులు. సరైన ఎగ్జిట్ ప్లాన్ లేదా నష్టాన్ని తట్టుకునే శక్తి లేకుండా చేసే ఇటువంటి పనులు ఆర్థిక విధ్వంసానికి దారితీస్తాయి.

సంపద అనేది నెమ్మదిగా నిర్మించబడుతుంది, కానీ పేదరికం అనేది క్షణాల్లో వస్తుంది అంటూ సోషల్ మీడియాలో చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఏదో ఒక అద్భుతం జరిగి రాత్రికి రాత్రే కోటీశ్వరులు అయిపోవాలనే ఆశే ఇలాంటి తప్పుడు నిర్ణయాలకు పునాది వేస్తుందంటున్నారు మరికొందరు. అనుభవం లేకుండా, అధిక వడ్డీకి అప్పులు తెచ్చి ఊహాజనిత మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడం జూదం కంటే ప్రమాదకరం అని కామెంట్ చేస్తున్నారు. ఈ స్టోరీ మనందరికీ ఇచ్చే సందేశం ఒక్కటే.. పెట్టుబడి పెట్టేటప్పుడు మన దగ్గర ఉన్న మిగులు డబ్బును వాడాలి తప్ప, అధిక వడ్డీకి అప్పులు తెచ్చి సాహసాలు చేయకూడదు అన్నదే.

# బెంగళూరులో పీజీల్లో ఉంటున్నారా..? 570 పీజీల్లో పరిస్థితి ఇది.. 8 పీజీలు మూతపడ్డయ్ కూడా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూరులో పీజీలు ఎంత అపరిశుభ్ర వాతావరణంలో, ఎంత అధ్వానంగా నిర్వహిస్తున్నారో గ్రేటర్ బెంగళూరు అథారిటీ (GBA) తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. బేసిక్ రూల్స్ కూడా పాటించని 574 పేయింగ్ గెస్ట్ (PG) హాస్టల్స్‌కు GBA నోటీసులు జారీ చేసింది. వీటిలో 8 పీజీలను GBAఅధికారులు మూసివేయించారు కూడా.

బెంగళూరులోని సీవీ రామన్ నగర్, శాంతి నగర్, గాంధీ నగర్, శివాజీ నగర్, చామరాజ్‌పేట్, చిక్కపేట్ ప్రాంతాల్లోని పీజీ వసతి గృహాల్లో గ్రేటర్ బెంగళూరు అథారిటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉంచడమే కాకుండా కనీసం స్వచ్ఛమైన తాగు నీళ్లు కూడా మెయింటైన్ చేయకుండా నడుపుతున్న 8 పీజీలను మూసేయించి.. మూడు లక్షలకు పైగా జరిమానా విధించారు.ఉద్యోగాలు, చదువులు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కోసం వచ్చి అకామిడేషన్ కోసం హాస్టళ్లలో ఉంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో కొందరు పీజీ నిర్వాహకులు కాసుల కక్కుర్తితో బేసిక్ రూల్స్ పాటించకుండా హాస్టల్స్ నడుపుతున్నారు. ఆఫీసుకు వచ్చేయాలని ఉద్యోగులను ఐటీ కంపెనీలు ఆదేశించడంతో బెంగళూరులోని హాస్టల్స్ దాదాపుగా నిండిపోయాయి. వేలకు వేలు డబ్బు కట్టి పీజీల్లో ఉంటున్నా రుచీపచీ లేని కూరలు, కొంచెం తింటే తినాలనిపించని అన్నం.. ఇదీ కొన్ని పీజీల్లో ఉన్న పరిస్థితి.

హైదరాబాద్‌లోని కొన్ని హాస్టల్స్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. పీజీల్లో ఫుడ్ నచ్చక సెలెక్టెడ్ డేస్‌లో మాత్రమే పీజీల్లో తింటూ బయట ఫుడ్ తింటున్న వాళ్లు చాలా మందే ఉన్నారు. కొందరు స్విగ్గీ, జొమాటోల్లో ఫుడ్ ఆర్డర్ పెట్టుకుని తింటున్న పరిస్థితి. అమీర్‌పేట్, దిల్ సుఖ్‌నగర్, ఎస్సార్ నగర్, మధురానగర్, కూకట్‌పల్లి, మాదాపూర్ వంటి ఏరియాల్లోని కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ దగ్గర్లోని పీజీల్లో ఉంటున్నారు. ఈ ప్రాంతాల్లోని హాస్టళ్లలో ఫుల్ రష్ కనిపిస్తోంది.

# బెంగళూరులో 'ఫాక్స్‌కాన్' వర్సెస్ 'గ్రామ పంచాయతీ'.. అసలేం జరుగుతోంది?




**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లాలో యాపిల్ ఐఫోన్ల తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్ సంస్థకు, స్థానిక గ్రామ పంచాయతీకి మధ్య మొదలైన వివాదం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మల్టీనేషనల్ కంపెనీలకు, స్థానిక సంస్థలకు మధ్య తలెత్తే ఘర్షణలకు ఇది అద్దం పడుతోంది. పన్నుల ఎగవేత, భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘన, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం వంటి తీవ్ర ఆరోపణలతో గ్రామ పంచాయతీ ఈ టెక్ దిగ్గజానికి నోటీసులు జారీ చేసింది.

దొడ్డగొల్లహళ్లి, అరువనహళ్లి గ్రామాల పరిధిలో సుమారు 5.33 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఫాక్స్‌కాన్ తన భారీ ప్లాంట్లను నిర్మించింది. అయితే పంచాయతీ రికార్డుల ప్రకారం ఆ భూమి ఇప్పటికీ ఖాళీ స్థలంగానే ఉంది. అంటే ఇంత భారీ స్థాయిలో నిర్మాణాలు పూర్తయి, కార్యకలాపాలు ప్రారంభమైనా.. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు వంటి ఎటువంటి పత్రాలను కంపెనీ సమర్పించలేదు. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన భారీ పన్నులు ఎగవేస్తున్నట్లు అధికారులు ఆరోపిస్తున్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ వంటి సంస్థలే పన్నులు కడుతుంటే, ఫాక్స్‌కాన్ ఎందుకు మొండికేస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు. వివాదంలో మరో ప్రధాన అంశం స్థానికులకు ఉపాధి కల్పన గురించే. ప్లాంట్ ఏర్పాటు సమయంలో లోకల్ యువతకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, తీరా కార్యకలాపాలు మొదలయ్యాక బయటి ప్రాంతాల వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇంటర్వ్యూల పేరుతో స్థానిక యువతను పిలిచి, ఆ తర్వాత వారిని పక్కన పెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కంపెనీ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో.. స్థానిక ప్రతినిధులు చట్టపరమైన చర్యలకు సిద్ధమయ్యారు.దీనిపై 7 రోజుల్లోగా సరైన డాక్యుమెంట్స్ సమర్పించకపోతే కర్ణాటక గ్రామ స్వరాజ్ అండ్ పంచాయత్ రాజ్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ హెచ్చరించింది. మరోవైపు స్థానికులకు ఉద్యోగాలు కల్పించకపోతే ఈ వారం చివర్లో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ఒక అంతర్జాతీయ సంస్థ స్థానిక నిబంధనలను గౌరవించకుండా వ్యవహరించడం ఇప్పుడు రాజకీయ మలుపులు తిరిగే అవకాశం కనిపిస్తోంది.

## అపార్ట్‌మెంట్లలో బతికే జనానికి మనసు అనేదే ఉండదా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** అపార్ట్‌మెంట్లలో, గేటెడ్ కమ్యూనిటీల్లో అమలు చేస్తున్న రూల్స్ డెలివరీ బాయ్స్ పాలిట శాపంగా మారాయి. డెలివరీ బాయ్స్ లిఫ్ట్ వాడకూడదన్న రూల్‌ను మెజారిటీ అపార్ట్‌మెంట్ సొసైటీలు, గేటెడ్ కమ్యూనిటీలు అమలు చేస్తున్నాయి. ఈ కారణంగా ఫుడ్ డెలివరీ బాయ్స్‌తో పాటు కొరియర్ బాయ్స్ కూడా ఎన్నో ఫ్లోర్ నుంచి ఆర్డర్ చేసినా మెట్లు ఎక్కుతూ.. ఆయాసపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈ రూల్‌పై తాజాగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. కారణం నెట్టింట వైరల్ అయిన ఈ వీడియోనే. అపార్ట్‌మెంట్లలో బతికే జనానికి మనసు అనేదే ఉండదేమోనని ఈ వీడియోపై కొందరు నెటిజన్లు స్పందించారు. ఇంతకీ ఈ వీడియోలో ఏముందంటే.. ఒక డెలివరీ బాయ్ ఒక పెద్ద పార్శిల్ మూటను మోసుకుంటూ మెట్లు ఎక్కుతున్నాడు.

ఆ మూట సైజ్ చూస్తుంటే.. చాలా బరువు ఉంటుందని అర్థమవుతుంది. ఈ పార్శిల్‌ను లిఫ్ట్‌లో తీసుకెళ్లనివ్వకపోవడంతో మెట్లు ఎక్కుతూ సదరు డెలివరీ బాయ్ ఆరవ ఫ్లోర్ వరకూ మోసుకెళ్లాడు. అంత కష్టపడి మోసుకొచ్చిన డెలివరీ బాయ్ ఇంట్లోకి వెళుతున్న సమయంలో పొరపాటున ఆ మూట డోర్‌కు తగిలింది. ఆర్డర్ చేసిన వాళ్లు అయ్యో పాపం అని అతనిపై జాలి చూపించాల్సింది పోయి.. 'ఆరాంసే.. బీ కేర్ ఫుల్' అని తమ పార్శిల్‌కు ఏమవుతుందోనని కంగారు పడటం సభ్య సమాజాన్ని సిగ్గుపడేలా చేసింది.'పిల్ల జమీందార్' సినిమాలో నానికి, అవసరాల శ్రీనివాస్‌యికు మధ్య ఒక సంభాషణ ఉంటుంది. మనుషులను అభిమానించడానికి.. వస్తువులను వాడుకోవడానికి దేవుడు సృష్టించాడు. కానీ.. మనం వస్తువులను ప్రేమిస్తున్నాం.. మనుషులను వాడుకుంటున్నాం అని అవసరాల చెప్పిన మాట అక్షరాల నిజమని ఈ వీడియో చూశాక అనిపించిందని కొందరు నెటిజన్లు నిట్టూర్చారు. ఏదేమైనా.. డెలివరీ బాయ్స్ కష్టాలు ఎలా ఉంటాయో ఈ వీడియో మరోసారి సమాజం కళ్లకు కట్టింది. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, విల్లాల్లో బతకడం గొప్ప కాదని.. సాటి మనిషి పరిస్థితిని చూసి పెద్ద మనసుతో స్పందించడం గొప్ప విషయం అని కొందరు నెటిజన్లు ఆర్డర్ చేసిన సదరు కస్టమర్‌కు హితవు పలికారు.

# బడ్జెట్ దెబ్బతో లిక్కర్ రేట్లకు రెక్కలు.. రూ.వెయ్యి బాటిల్ రేటు ఇప్పుడు ఎంతంటే..?





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి ఏటా బడ్జెట్ అనగానే సామాన్యుడు మొట్టమొదట వెతికేది.. ఏ వస్తువుల ధరలు తగ్గాయి.. ఏవి పెరిగాయి అనే. కేంద్ర బడ్జెట్ 2026లో ఈసారి కూడా 'సిన్ గూడ్స్' అంటే మద్యం, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల ధరలపై భారం పడింది. పాత ధరలతో పోలిస్తే ఇప్పుడు మద్యం బాటిల్ కొనాలన్నా, సిగరెట్ ప్యాకెట్ పట్టాలన్నా జేబుకు పెద్ద చిల్లే పడుతోంది. ముఖ్యంగా మద్యం ప్రియులకు ఈ బడ్జెట్ పెద్ద షాక్ ఇచ్చిందనే చెప్పాలి. నిజానికి మద్యంపై పన్నులు విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉన్నప్పటికీ.. కేంద్ర బడ్జెట్ లో తీసుకునే కొన్ని సాంకేతిక నిర్ణయాలు వీటి ధరలపై ప్రభావం చూపుతాయి. ఈసారి బడ్జెట్‌లో ఆల్కహాల్ స్క్రాప్, మినరల్ సేల్స్ మీద ఉండే ఎజూ -ను గతంలో ఉన్న 1 శాతం నుంచి 2 శాతానికి పెంచారు. ఇది చిన్న మార్పులా అనిపించినా.. సప్లై చైన్ ద్వారా తయారీదారుల నుండి వినియోగదారుడికి చేరేసరికి ధర భారీగానే పెరుగుతుంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎక్సైజ్ సుంకాలను సవరించే అవకాశం ఉండటంతో ధరల పెరుగుదల అనివార్యంగా మారింది.పన్ను మార్పుల వల్ల గతంలో రూ.వెయ్యి ఉన్న ఒక మద్యం బాటిల్ ధర ఇప్పుడు సుమారు రూ.1,050 నుండి రూ.1,100 వరకు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రాల వారీగా ఉండే ఎక్సైజ్ నిబంధనలను బట్టి ఈ ధరలో మార్పులు ఉండవచ్చు. సిగరెట్ల విషయానికొస్తే వీటిపై దాదాపు 40 శాతం జీఎస్టీతో పాటు అదనపు సెస్, ఎక్సైజ్ డ్యూటీలను విధించారు. దీనివల్ల పొగ తాగే అలవాటు ఉన్నవారికి నెలవారీ ఖర్చులు భారీగా పెరగనున్నాయి. అయితే బీడీల రేట్లు మాత్రం పెద్దగా మారలేదు. ఇది ఆ రంగంపై ఆధారపడిన కార్మికులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వాలు ఈ రకమైన పన్నుల పెంపు ద్వారా భారీగా ఆదాయాన్ని ఆర్జించాలని చూస్తున్నాయి. వినియోగం తగ్గకపోతే ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షం కురుస్తుంది. అయితే ఆరోగ్య నిపుణులు మాత్రం పన్నులు పెంచి ధరలు పెంచడం వల్ల ప్రజలు ఈ అలవాట్లకు దూరమవుతారని ఆశిస్తున్నారు. ఏది ఏమైనా బడ్జెట్ 2026 తర్వాత సగటు మధ్యతరగతి కుటుంబంలో విలాసాల కోసం కేటాయించే బడ్జెట్‌ను ఖచ్చితంగా తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# మటన్ బోటీ ఇలా తింటున్నారా.!



**హైదరాబాద్ పెన్ పవర్:** మటన్ బోటీ రుచితో పాటు ఆరోగ్యానికీ మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఐరన్, జింక్, విటమిన్లు, ప్రొటీన్లు అధికంగా ఉండే బోటీ రక్తహీనతను తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అయితే, శుభ్రపరిచే విధానం, సరైన ఉడికించడం, మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. పండగలు లేదా ఆదివారాలు రాగానే మాంసాహార ప్రియుల ఇళ్లలో మటన్ ఘుమఘుమలాడాల్సిందే. మటన్ ముక్కలతో పాటు, మేక తలకాయ మాంసం, కాళ్లు, రక్తం, బోటీని చాలామంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. అయితే వీటిలో బోటీ రుచికి మాత్రమే పరిమితం కాకుండా, ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మేక కేవలం పచ్చని ఆకులను మాత్రమే ఆహారంగా తీసుకుంటుంది కాబట్టి, దాని పేగుల్లో మన శరీరానికి అవసరమైన అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. బోటీ వల్ల కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు అనేకమున్నాయి. మేక పేగుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలోని హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తహీనతతో బాధపడే వారికి ఇది ఒక మంచి ఆహార వనరు. అంతేకాకుండా, చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా బోటీ మేలు చేస్తుంది. బోటీలో జింక్ అధికంగా ఉంటుంది. ఇది చర్మం కాంతివంతంగా ఉండడానికి, జుట్టు దృఢంగా పెరగడానికి సహాయపడుతుంది. అలాగే ఇందులోని విటమిన్ ఎ, విటమిన్ ఈ చర్మ కణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. బోటీని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. ఇది వైరస్‌లు, బ్యాక్టీరియాల నుంచి శరీరాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అనారోగ్యాలను నివారిస్తుంది. ఇంతేకాక, శారీరక బలానికి కావలసిన ప్రొటీన్లు, బి విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. శరీరానికి శక్తిని అందిస్తాయి. అయితే, బోటీ తినడం వల్ల లాభాలు ఉన్నప్పటికీ, దాన్ని శుభ్రం చేసే పద్ధతి చాలా ముఖ్యం. మేక పేగుల్లో మలినాలు ఉండే అవకాశం ఉన్నందున, వాటిని వేడి నీటితో కనీసం నాలుగైదు సార్లు క్షుణ్ణంగా కడిగి శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాతే బాగా ఉడికించి తీసుకోవాలి. సరిగ్గా ఉడకని బోటీ వల్ల జీర్ణక్రియ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. వైద్య నిపుణులు మార్కెట్లో తక్కువ ధరకే దొరుకుతుందని లేదా రుచిగా ఉందని అతిగా తినడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. మటన్ లేదా బోటీ ఏదైనా సరే, పరిమితంగా, సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకున్నప్పుడే శరీరానికి పూర్తి ఆరోగ్యం చేకూరుతుంది. సరైన పరిశుభ్రత, మితమైన వినియోగం బోటీ ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి కీలకం.

# అరటి తొక్కతో వంట గదిని తళతళ లాడించే చిట్కాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిరోజూ వంట చేయడం వల్ల, మీరు ఎంత శుభ్రం చేసినా కొన్ని పాత్రలపై నూనె మొండి మరకలు, నల్లటి పొర అలాగే ఉంటాయి. ఇది పాత్ర అందాన్ని పాడు చేస్తుంది. ఈ మరకలను తొలగించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం ఉండదు. అయితే మీరు అరటి తొక్కతో ఎప్పుడైనా పాత్రలు కడిగారా? వంటగదిని శుభ్రంగా ఉంచుకున్నట్లే, వంట చేయడానికి ఉపయోగించే పాత్రలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. అయితే ప్రతిరోజూ వంట చేయడం వల్ల, మీరు ఎంత శుభ్రం చేసినా కొన్ని పాత్రలపై నూనె మొండి మరకలు, నల్లటి పొర అలాగే ఉంటాయి. ఇది పాత్ర అందాన్ని పాడు చేస్తుంది. ఈ మరకలను తొలగించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం ఉండదు. అయితే మీరు అరటి తొక్కతో ఎప్పుడైనా పాత్రలు కడిగారా? వీటిని ఉపయోగించి పాత్రలపై అంటుకున్న మరకలను సులభంగా తొలగించవచ్చు. అరటి తొక్కలోని తెల్లటి లోపలి భాగంలో పొటాషియం, కొన్ని సహజ నూనెలు పుష్కలంగా ఉంటాయి. ఇవి పాత్రలపై మురికిని తొలగించడంలో సహాయపడతాయి. స్టీల్ లేదా నాన్-స్టిక్ పాత్రలలో మాడిన మొండి మరకలు ఉంటే, వాటిని తొలగించడానికి అరటి తొక్క లోపలి భాగాన్ని పాత్రపై రుద్ది 10 నుంచి 15 నిమిషాలు అలాగే ఉంచాలి. ఆ తర్వాత తేలికపాటి స్క్రబ్బర్‌తో శుభ్రం చేయండి. అలాగే అరటి తొక్కపై కొంత టూత్‌పేస్ట్‌ను అప్లై చేసి కూడా పాత్రలను స్క్రబ్ చేయవచ్చు. అరటి తొక్కలలో పొటాషియం, భాస్వరం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. తొక్కలను చిన్న ముక్కలుగా కోసి మట్టిలో పాతిపెట్టాలి. లేదా నీటిలో మరిగించి మొక్కలకు ఈ నీళ్లు పోయాలి. ఇది మొక్కలను పచ్చగా ఉంచడానికి సహాయపడుతుంది. లెదర బూట్లు, పర్సులు,బెల్టులు కాలక్రమేణా వాటి మెరుపును కోల్పోతాయి. కాబట్టి అరటి తొక్క లోపలి భాగాన్ని బూట్లపై రుద్ది, ఆపై పొడి గుడ్డతో పాలిష్ చేయండి. ఇది తోలు వస్తువులకు సహజ మెరుపును తిరిగి తెస్తుంది. అరటి తొక్కలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని పోషిస్తాయి. మొటిమలు, పొడి చర్మంతో బాధపడేవారు తొక్క లోపలి భాగాన్ని సున్నితంగా రుద్దాలి. ఆ తర్వాత 10 నిమిషాల పాటు అలాగే ఉంచి ముఖం కడిగేయాలి. దీన్ని క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల చర్మం మృదువుగా మారుతుంది. వెండి పాత్రలు మసకబారినా, ఉక్కు పాత్రలు వాటి మెరుపును కోల్పోయినా అరటి తొక్కను ఆ పాత్రలపై రుద్ది, నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇది మెరుపును తిరిగి తెస్తుంది.

# ప్రెజర్ కుక్కర్‌లో వీటిని వండటం వెంటనే ఆపండి!




**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు వంట త్వరగా పూర్తి చేయడానికి, గ్యాస్ ఆదా చేయడంలో ఇది సహాయపడుతుందనేది నిజం. కానీ వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాన్ని వండటం సరైనది కాదు. దాదాపు అన్ని వంట పనులకు దాదాపు ప్రతి ఇంట్లోనూ ప్రెషర్ కుక్కర్లను ఉపయోగిస్తున్నారు. అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు వంట త్వరగా పూర్తి చేయడానికి, గ్యాస్ ఆదా చేయడంలో ఇది సహాయపడుతుందనేది నిజం. కానీ వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాన్ని వండటం సరైనది కాదు. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. అందువల్ల ఈ కింది కొన్ని రకాల ఆహారాలను ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదు. సాధారణంగా చాలా మంది కుక్కర్‌లో అన్నం వండుతారు. కానీ అన్నంన్ని ఎప్పుడూ కుక్కర్‌లో వండకూడదు. ఎందుకంటే ఇలా కుక్కర్‌లో అన్నం వండడం వల్ల ఆర్సెనిక్ అనే విష పదార్థం విడుదల అవుతుంది. ఇది మన ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఓపెన్ పాత్రలో మాత్రమే అన్నం వండటం మంచిది. పాలకూర, మెంతులు, కొల్లార్డ్ ఆకుకూరలు వంటి ఆకుకూరలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల వాటి పోషకాలు నశించి, మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి వాటిని సాధారణ పాన్‌లో తక్కువ వేడి మీద ఉడికించడం మంచిది. బీన్స్‌లో లెక్టిన్ అనే సహజంగా లభించే టాక్సిన్ ఉంటుంది. ఇది సరిగ్గా ఉడికించకపోతే జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. ఫుడ్ పాయిజనింగ్‌కు కూడా కారణమవుతుంది. అలాగే ప్రెషర్ కుకింగ్ బీన్స్‌లోని లెక్టిన్‌ను వేగంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి ఈ కూరగాయను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం మంచిది కాదు. ప్రెషర్ కుక్కర్‌లో పాలు మరిగించడం వల్ల దాని సహజ నిర్మాణం మారి, అది పెరుగులా మారుతుంది. తద్వారా దాని పోషక విలువలు తగ్గుతాయి. పాలు మరిగించడానికి స్టీల్ లేదా నాన్-స్టిక్ పాన్ వాడటం మంచిది. టమోటాలు, చింతపండు వంటి పుల్లని పదార్థాలను ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల అవి ఆమ్లంగా మారతాయి. ఇది శరీరానికి హానికరం. కాబట్టి, వాటిని స్టీల్ లేదా మట్టి పాత్రలో ఉడికించడం మంచిది.

# పంచగ్రాహి యోగం.. ఈ రాశులకు తిరుగులేని రాజయోగం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిబ్రవరిలో ఏర్పడే పంచగ్రాహీ రాజయోగం ప్రభావం అన్ని రాశుల్లోనూ కనిపిస్తుంది. వారిలో కొందరు అదృష్టవంతులవుతారు. దీంతో వారికి అన్ని రకాలుగా కలిసి వస్తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కెరీర్ పురోగతి ఉంటుంది. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం గ్రహాలు తమ రాశులను మారుస్తూ ఉంటాయి. గ్రహాల మార్పుల కారణంగా అనేక అరుదైన రాజయోగాలు ఏర్పడబోతున్నాయి. అలాంటి యోగాల వల్ల 12 రాశులపై అనుకూల, ప్రతికూల ప్రభావాలు చూపుతాయి. ఫిబ్రవరి నెలలో గ్రహాలకు అధిపతిగా పరిగణించబడే సూర్య భగవానుడు, గ్రహాలకు యువరాజుగా పిలువబడే బుధుడు, సంపదకు మూలమైన శుక్రుడు, గ్రహాలకు సర్వ సైన్యాధ్యక్షుడిగా పేరొందిన కుజుడు, ఛాయ గ్రహం రాహువు కలయికతో శక్తివంతమైన రాజయోగం ఏర్పడుతోంది. ప్రధానంగా ఈ యోగం వని గ్రహమైన కుంభరాశిలో ఏర్పడుతోంది. ఈ యోగ ప్రభావం అన్ని రాశుల్లోనూ కనిపిస్తుంది. వారిలో కొందరు అదృష్టవంతులవుతారు. దీంతో వారికి అన్ని రకాలుగా కలిసి వస్తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కెరీర్ పురోగతి ఉంటుంది. సింహరాశి వారికి 7వ ఇంట్లో పంచగ్రాహి యోగం ఏర్పడుతోంది. దీని కారణంగా సింహరాశివారికి సానుకూల ఫలితాలు పొందుతారు. వైవాహిక జీవితంలో ఆనందం వెల్లివిరుస్తుంది. రాజకీయ, ప్రభుత్వ సంబంధిత ఉద్యోగాలలో ఉన్నవారు గణనీయమైన ప్రయోజనాలను అందుకుంటారు. మీ పని పరిస్థితి మెరుగుపడుతుంది. అవివాహితులకు మంచి సంబంధం దొరుకుతుంది. దీర్ఘకాలంగా ఉన్న కోరికలు నెరవేరుతాయి. మేష రాశి వారికి 11వ ఇంట్లో పంచగ్రాహి రాజయోగం ఏర్పడుతోంది. ఇది మేష రాశి వారికి ఆదాయంలో మంచి పెరుగుదలకు దారితీస్తుంది. కెరీర్‌లో మంచి పురోగతి ఉండబోతుంది. అనేక శుభవార్తలను వింటారు. పనిలో మీ స్థానం బలపడుతుంది. ప్రతి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేస్తారు. పెట్టుబడుల నుంచి మంచి లాభాలు వస్తాయి. స్టాక్ మార్కెట్, లాటరీ వంటి వాటి నుంచి మీకు మంచి లాభం రావచ్చు. కుంభ రాశి వారికి మొదటి ఇంట్లో పంచగ్రాహి యోగం ఏర్పడుతోంది. ఇది కుంభ రాశి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. సమాజంలో గౌరవం పెరుగుతుంది. వైవాహిక జీవితంలో ఆనందం పెరుగుతుంది. జంటల మధ్య ప్రేమ పెరుగుతుంది. పని చేసే వారికి పదోన్నతి, జీతం పెరిగే అవకాశం ఉంది. అనేక మార్గాల నుంచి మీకు ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు.

# లేచి నిలబడగానే తల, కళ్లు తిరుగుతున్నట్లు అనిపిస్తుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** కుర్చీలోంచి లేచిన తర్వాత అకస్మాత్తుగా తల తిరుగుతున్నట్లు, కళ్ళ ముందు చీకటిగా.. పడిపోయినట్లు అనిపిస్తే, దానిని తేలికగా తీసుకోకండి. ఇది ఒక సాధారణ సమస్య కాదు, దాని వెనుక వైద్యపరమైన కారణం ఉండవచ్చంటున్నారు వైద్య నిపుణులు. ఈ పరిస్థితిని ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ లేదా భంగిమ హైపోటెన్షన్ అంటారు. కుర్చీలోంచి లేచిన తర్వాత అకస్మాత్తుగా తల తిరుగుతున్నట్లు, కళ్ళ ముందు చీకటిగా.. పడిపోయినట్లు అనిపిస్తే, దానిని తేలికగా తీసుకోకండి. ఇది ఒక సాధారణ సమస్య కాదు, దాని వెనుక వైద్యపరమైన కారణం ఉండవచ్చంటున్నారు వైద్య నిపుణులు. ఈ పరిస్థితిని ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ లేదా భంగిమ హైపోటెన్షన్ అంటారు. కూర్చున్న లేదా పడుకున్న స్థానం నుండి అకస్మాత్తుగా లేచిన తర్వాత శరీరం రక్తపోటును త్వరగా సర్దుబాటు చేసుకోలేదు. తగినంత రక్తం మెదడుకు చేరుకోలేనప్పుడు ఇది జరుగుతుంది. మీకు తల తిరుగుతున్నట్లు, దృష్టి మసకబారినట్లు, మూర్ఛగా అనిపించడానికి ఇదే కారణం..! ప్రముఖ హాస్పిటల్ న్యూరాలజిస్ట్ ఈ విషయాలను ఈజీగా తీసుకోవద్దని సూచిస్తున్నారు. మనం లేచి నిలబడగానే, గురుత్వాకర్షణ శక్తి కాళ్లకు రక్తం వేగంగా పరుగెత్తేలా చేస్తుంది. సాధారణంగా, శరీరంలోని స్వయంప్రతిపత్త నాడీ వ్యవస్థ నరాలను కుదించడం, హృదయ స్పందన రేటును పెంచడం ద్వారా వెంటనే భర్తీ చేస్తుంది. అయితే, ఈ ప్రతిస్పందన మందగించినట్లయితే, తల తిరగడం సంభవించవచ్చు. డైటీషియన్ ప్రకారం, నిలబడటం వల్ల కాళ్లలో రక్తం పేరుకుపోతుంది. ఇది మెదడుకు ఆక్సిజన్ సరఫరాను తగ్గిస్తుంది. పుష్కలంగా నీరు త్రాగడం, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడం, నెమ్మదిగా నిలబడటం వల్ల ఈ సమస్య నుండి ఉపశమనం పొందవచ్చంటున్నారు వైద్య నిపుణులు. నిర్జలీకరణం, రక్తహీనత, ఎక్కువసేపు బెడ్ రెస్ట్ తీసుకోవడం, కొన్ని మందులు, వృద్ధాప్యంతో సంబంధం ఉన్న శరీరం తగ్గిన ప్రతిచర్యలు కూడా తల తిరుగుదలకు కారణమవుతాయి. నిలబడిన మొదటి నిమిషంలో రక్తపోటు అకస్మాత్తుగా తగ్గడం వల్ల చిత్తవైకల్యం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పరిశోధనలో తేలింది. నిలబడిన 30 సెకన్లలోపు సిస్టోలిక్ రక్తపోటు 20 ఎఎఊణ లేదా అంతకంటే ఎక్కువ తగ్గిన వ్యక్తులకు భవిష్యత్తులో చిత్తవైకల్యం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని అధ్యయనంలో తేలింది. ఒక వ్యక్తి నిలబడి ఉన్నప్పుడు పదే పదే తల తిరుగుతున్నట్లు అనిపిస్తే, వారు తమ వైద్యుడికి తెలియజేయాలి. వారి రక్తపోటును తనిఖీ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది ముఖ్యంగా వృద్ధులలో పడిపోవడం, ఎముకలు విరగడం, తీవ్రమైన గాయాల ప్రమాదాన్ని పెంచుతుంది. దీనిని నివారించడానికి, నెమ్మదిగా నిలబడటం, పుష్కలంగా నీరు త్రాగడం, పాదాలకు వ్యాయామం చేయడం, ఇంట్లో జారిపోకుండా ఉండే ఏర్పాట్లు చేయడం, అవసరమైతే, మీ మందులను వైద్యుడితో సమీక్షించడం ముఖ్యం. సకాలంలో శ్రద్ధ వహిస్తే, ఈ సమస్యను చాలా వరకు నియంత్రించవచ్చు. జీవనశైలి మార్పులతో, మనం దీనిని అధిగమించవచ్చు.

# చర్మంపై కనిపించే ఈ మార్పులు విస్మరించొద్దు..



**హైదరాబాద్ పెన్ పవర్:** గతంలో ఈ వ్యాధి వృద్ధులలో మాత్రమే కనిపించేది. కానీ ఇప్పుడు అలా కాదు. ఈ సమస్య యువతలో కూడా కనిపిస్తుంది. డయాబెటిస్ సాధారణంగా రక్తంలో చక్కెర స్థాయిలకు సంబంధించినది అయినప్పటికీ, దాని ప్రభావాలు చర్మంతో సహా శరీరంలోని అనేక భాగాలను ప్రభావితం చేస్తాయి. ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా డయాబెటిస్ కేసులు పెరిగిపోతున్నాయి. గతంలో ఈ వ్యాధి వృద్ధులలో మాత్రమే కనిపించేది. కానీ ఇప్పుడు అలా కాదు. ఈ సమస్య యువతలో కూడా కనిపిస్తుంది. డయాబెటిస్ సాధారణంగా రక్తంలో చక్కెర స్థాయిలకు సంబంధించినది అయినప్పటికీ, దాని ప్రభావాలు చర్మంతో సహా శరీరంలోని అనేక భాగాలను ప్రభావితం చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయి చాలా కాలం పాటు ఎక్కువగా ఉంటే అది శరీరంలో రక్త ప్రసరణ, తేమ సమతుల్యతను ప్రభావితం చేయడం ప్రారంభిస్తుంది. ఇది చర్మం సహజ రక్షణలను బలహీన పరిచి చర్మ సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. కానీ అవాగాహన లేకపోవడం వల్ల చాలా మంది ఇలాంటి లక్షణాలను విస్మరిస్తుంటారు. కానీ చర్మంపై ఇలా కనిపించే లక్షణాలు డయాబెటిస్ ముందస్తు హెచ్చరికలు. డయాబెటిస్ చర్మంలో వివిధ మార్పులకు కారణమవుతుంది. శరీరానికి అవసరమైన తేమను నిర్వహించడంలో సమస్యలు తలెత్తితే అది చర్మం పొడిబారడానికి కారణం అవుతుంది. పొడి చర్మం వల్ల కొంతమందికి తరచుగా దురద, మంటలు ఎదురవుతాయి. ముఖ్యంగా మెడ లేదా తొడల చుట్టూ నల్లటి మచ్చలు ఏర్పడటం కూడా ఒక లక్షణం కావచ్చు. చర్మంపై ఏర్పడే చిన్న కోతలు, గాయాలు సైతం మానడానికి సమయం తీసుకోవడం మధుమేహం ప్రధాన లక్షణంగా పరిగణించవచ్చు. పునరావృతమయ్యే ఫంగల్, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, పూతలు, మొటిమలు కనిపించడం, చర్మంపై ఎరుపు మచ్చలు.. ఇవన్నీ మధుమేహం వచ్చే ముందు చర్మంపై కనిపించే సంకేతాలు. ఈ మార్పులన్నీ శరీరంలోని చక్కెర స్థాయిలు సమతుల్యంగా లేవని సూచిస్తున్నాయి. మీ చర్మంపై ఇలాంటి మార్పులు నిరంతరం కనిపిస్తే, ముందుగా రక్తంలో చక్కెర స్థాయిలను తనిఖీ చేసుకోవల్సి ఉంటుంది. మధుమేహాన్ని అదుపులో ఉంచడానికి, సమతుల్య ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం కూడా చేయాలి. వైద్యుడు సూచించిన విధంగా మందులు తీసుకోవాలి. మీ చర్మాన్ని శుభ్రంగా, తేమగా ఉంచుకోవాలి. రసాయనాలు కలిగిన ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించాలి. చర్మానికి అనుకూలమైన ఉత్పత్తులను మాత్రమే వాడాలి. ఎలాంటి ఇన్ఫెక్షన్ లేదా గాయం అయినా విస్మరించ కూడదు. అవసరమైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

# వరల్డ్ కప్ టాప్ స్కోరర్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రెండూ అతడికే: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్




హైదరాబాద్ పెన్ పవర్: 2026 టీ20 వరల్డ్ కప్ కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ఈ మెగా టోర్నీని భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ చరిత్రలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ చోటు చేసుకుంది . టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్- నెదర్లాండ్ మధ్య జరగుతుంది. వరల్డ్ కప్ కు కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో క్రికెట్ ఫ్యాన్స్ ఈ మెగా టోర్నీ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. సొంతగడ్డపై జరగనుండడంతో టీమిండియా ఈ టోర్నీలో టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. టోర్నీకి ముందు ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ 2026 టీ20 వరల్డ్ కప్ లో టాప్ స్కోరర్ ఎవరో తన అభిప్రాయాన్ని తెలిపాడు. వరల్డ్ కప్ టాప్ స్కోరర్ గురించి మాట్లాడుతూ పాంటింగ్ ఇలా అన్నాడు.. "అభిషేక్ శర్మ స్టార్ బ్యాటర్. ఎక్స్ పీరియన్స్ లేకపోవడం అతనికి సానుకూల విషయం అని నేను భావిస్తున్నాను. 2026 టీ 20 వరల్డ్ కప్ లో అభిషేక్ టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ కూడా కావొచ్చు. అతని హిట్టింగ్ అద్భుతంగా ఉంటుంది. అభిషేక్ ఆడితే ఇండియాకు వరల్డ్ కప్ గెలవడం పెద్ద కష్టం కాదు. ఒకవేళ అతను విఫలమైతే ఇండియా వరల్డ్ కప్ ఆశలు సంక్లిష్టం అవుతాయి. ఈ వరల్డ్ కప్ కు అభిషేక్ ఇండియాకు చాలా కీలకం. నేను అభిషేక్ శర్మ మొదటి కోచ్ ని. 17 ఏళ్ళ వయసులో ఢిల్లీ జట్టులో ఉన్నప్పుడే చాలా ప్రభావం చూపించాడు. అభిషేక్ పై నాకు భారీ అంచనాలు ఉన్నాయి". అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు.

**తొలిసారి 20 జట్లతో టీ20 వరల్డ్ కప్:**

ఈ సారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, స్కాట్లాండ్, ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్తాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి. ఇండియా, పాకిస్తాన్ , అమెరికా (ఖూతా), నమీబియా, నెదర్లాండ్స్ ఒకే గ్రూపులో ఉన్నాయి. భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

**నెంబర్ వన్ ర్యాంక్ లో అభిషేక్ శర్మ:**

అభిషేక్ శర్మ ప్రస్తుతం టీ20 ఫార్మాట్ లో నెంబర్ వన్ బ్యాటర్ గా ఉన్నాడు. వరల్డ్ క్రికెట్ లో నెంబర్ వన్ బ్యాటర్ గా కొనసాగుతున్న అభిషేక్ అంచనాలకు తగ్గట్టుగా ఆడుతున్నాడు. ప్రత్యర్థి, వేదిక, బౌలర్ తో సంబంధం లేకుండా తన బ్యాటింగ్ తో బౌలర్లకు చెమటలు పట్టిస్తున్నాడు. న్యూజిలాండ్ తో జరిగిన తొలి టీ20లో కేవలం 35 బంతుల్లోనే 84 పరుగులు చేసి కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఓవరాల్ గా ఈ సిరీస్ లో 45 యావరేజ్.. 250 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేశాడు.

# ఇలాగైతే కంగారులను కష్టమే: ఆస్ట్రేలియాకు వరుస షాకులు.. వరల్డ్ కప్ నుంచి ముగ్గురు మొనగాళ్లు ఔట్





హైదరాబాద్ పెన్ పవర్: ఇండియా, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ ముందు ఆస్ట్రేలియా జట్టుకు ఊహించని షాక్ లు తగులుతున్నాయి. కొన్నేళ్లుగా ఆ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్న ఫాస్ట్ బౌలర్స్ పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజల్ వుడ్ అందుబాటులో ఉండడం లేదు. కొన్ని నెలల క్రితం స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇటీవలే వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ టీ20 వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. తాజాగా జోష్ హేజల్ వుడ్ వరల్డ్ కప్ లోని గ్రూప్ మ్యాచ్ లకు దూరం కావడంతో కంగారులకు వరల్డ్ కప్ ముందు కోలుకోలేని దెబ్బ తగిలింది. హేజల్ వుడ్ మడమ గాయంతో బాధపడుతున్నాడు. ఈ స్టార్ పేసర్ ప్రస్తుతం సిడ్నీలో పునరావాసం పొందుతున్నాడు. వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా జట్టుతో పాటు జోష్ ఇండియాకు ట్రావెల్ చేయడం లేదు. హేజల్ వుడ్ స్థానంలో సీన్ అబాట్ ను ట్రావెలింగ్ రిజర్వ్ గా ఎంపిక చేశారు. గాయం కారణంగా యాషెస్ సిరీస్ కు దూరమైన ఈ ఆసీస్ పేసర్..పూర్తి ఫిట్ నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు. సూపర్ 8 మ్యాచ్ లకు కూడా హేజల్ వుడ్ అందుబాటులో ఉండడం అనుమానంగా మారింది. హేజల్ వుడ్ తో పాటు మరో ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్ కూడా ఫిట్ నెస్ సమస్యలతో బాధపడుతున్నాడు.

**వెన్ను గాయంతో కమ్మిన్స్ ఔట్:**

స్టార్ బౌలర్ పాట్ కమ్మిన్స్ టీ20 వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. వెన్ను గాయం కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి కమ్మిన్స్ వైదొలిగినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. అతడి స్థానంలో బెన్ ద్వార్షుయిస్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పూ ఈవెంట్‌కు కమ్మిన్స్ దూరం కావడం ఆస్ట్రేలియాకు భారీ ఎదురు దెబ్బనేనని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ టీమ్‌లో ప్రధానంగా రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ మెగా టోర్నీకి దూరం కాగా అతడి స్థానంలో బెన్ ద్వార్షుయిస్‌ను ఎంపిక చేసింది. ఇక, తాత్కాలిక జట్టులో ఉన్న మాట్ షార్ట్‌ను తప్పించి అతని స్థానంలో మాట్ రెన్షాను జట్టులోకి తీసుకుంది. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజల్ వుడ్ త్రయం లేకుండా ఆసీస్ పేస్ బౌలింగ్ కొంచెం బలహీనంగా మారింది. ఇటీవలే పాకిస్తాన్ తో జరిగిన మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను ఆస్ట్రేలియా 0-3 తేడాతో కోల్పోయింది. బ్యాటింగ్ దుర్భేద్యంగా కనిపిస్తున్నా బౌలింగ్ లో మాత్రం కంగారూల జట్టుకు ఇబ్బందులు తప్పేలా లేదు. స్పిన్నర్ ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్ పై ఆసీస్ భారీ ఆశలు పెట్టుకుంది. జట్టులో ఎక్కువగా ఆల్ రౌండర్లు ఉండడం కలిసొచ్చే విషయం.

## USAతో ఇండియా 'ఏ' వార్మప్ మ్యాచ్.. అందరి దృష్టి అతడిపైనే.. లైవ్ స్ట్రీమింగ్ ఎందులో చూడాలంటే..?





హైదరాబాద్ పెన్ పవర్: ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 వార్మప్ మ్యాచ్ లకు రంగం సిద్ధమైంది. సోమవారం (ఫిబ్రవరి 2) నుంచి వార్మప్ మ్యాచ్ లు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా నేడు ఇండియా ఏ (ఫిబ్రవరి 2) యూఎస్ఏతో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఇండియా సీనియర్ జట్టు ఆడడం లేదు. చిన్న జట్టు కావడంతో బీసీసీఐ భారత 'ఏ' జట్టును ప్రకటించింది. జియో హాట్‌స్టార్ యాప్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లోవార్మప్ మ్యాచ్ లు ప్రత్యక్ష ప్రసారమవుతాయి. మ్యాచ్ సాయంత్రం 5:00 గంటలకు ప్రారంభమవుతుంది. డీవై పాటిల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఖూతాతో నేడు జరగబోయే మ్యాచ్ లో అందరి కళ్ళు టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మపైనే ఉన్నాయి. గత నెలలో విజయ్ హజారే ట్రోఫీ ఆడుతూ తిలక్ గాయపడ్డాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ తో జరిగిన ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ కు దూరమయ్యాడు. పూర్తి ఫిట్ నెస్ సాధించిన ఈ హైదరాబాదీ కుర్రాడు వార్మప్ మ్యాచ్ లో రాణించి గాడిలో పడాలని టీమిండియా యాజమాన్యం భావిస్తుంది. తిలక్ వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉండడంతో తనను తాను నిరూపించుకోవడం ఈ యంగ్ ప్లేయర్ కు చాలా కీలకం. తిలక్ తో పాటు రవి బిష్ణోయ్, రియాన్ పరాగ్ కూడా వరల్డ్ కప్ స్క్వాడ్ లో సుందర్ స్థానంలో ఎంపికయ్యే అవకాశం ఉంది. దీంతో వీరిద్దరూ రాణించడం తప్పనిసరి. సోమవారం (ఫిబ్రవరి 2) నుంచి ఫిబ్రవరి 6 వరకు వార్మప్ మ్యాచ్ లు జరుగుతాయి. మొత్తం 5 రోజుల పాటు 15 మ్యాచ్ ల షెడ్యూల్ ను ఏర్పాటు చేశారు. మొత్తం మూడు వార్మప్ మ్యాచ్ లు టీమిండియా ఆడాల్సి ఉంది. ఇండియా ఫిబ్రవరి 4 న సౌతాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. ఇండియా వరల్డ్ కప్ లో ఆడబోయే లీగ్ మ్యాచ్ కు మూడు రోజులు ముందు డీవై పాటిల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు జరుగుతుంది. అమెరికా, నమీబియాలతో జరగబోయే వార్మప్ మ్యాచ్ ల కోసం సీనియర్ జట్టు కాకుండా ఇండియా 'ఏ' జట్టు ఆడనుంది. బీసీసీఐ భారత 'ఏ' జట్టును సోమవారం (ఫిబ్రవరి 2) ప్రకటించింది. భారత ఏ జట్టుకు బదోనీ కెప్టెన్సీ చేయనున్నాడు. స్క్వాడ్ లో తిలక్ వర్మను కూడా ఎంపిక చేశారు. మన్ దీప్, అశుతోష్ శర్మ, ప్రియాంష్ ఆర్య, ఉర్విల్ పటేల్, పరాగ్ జట్టులో సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. ఇటీవల న్యూజిలాండ్ తో జరిగిన టీ20 సిరీస్ లో ఆడిన రవి బిష్ణోయ్ ని ఎంపిక చేశారు. మానవ్ సుతార్, విప్రజ్ నిగమ్ రూపంలో ఇద్దరు స్పిన్-బౌలింగ్ ఆల్ రౌండర్లు ఉన్నారు. గుర్జప్నీత్ సింగ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్, అశోక్ శర్మ లతో పేస్ విభాగాన్ని ఎంపిక చేశారు.



# ట్రెండీ అవుట్ ఫిట్ లో మృణాల్ అందాలు.. ఆ లుక్ చూసారా?

టాలీవుడ్‌లో 'సీతారామం'తో ప్రతి ఇంటి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్, ఇప్పుడు తన గ్లామర్ , స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. సంప్రదాయబద్ధమైన పాత్రల్లో ఎంతగా ఒదిగిపోతుందో, మోడ్రన్ బోల్డ్ లుక్స్‌లోనూ అంతే ధైర్యంగా తన బ్యూటీని ఎలివేట్ చేయగలగడం ఆమె ప్రత్యేకత. కేవలం నటనకే పరిమితం కాకుండా, ఫ్యాషన్ ఐకాన్‌గా మారుతూ యువతలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. భాషతో సంబంధం లేకుండా తన ప్రతిభతో నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న ఈ భామ, ఫ్యాన్స్ మనసుల్లో చెరగని ముద్ర వేస్తోంది.



**మోడ్రన్ లుక్‌లో వెలిగిపోతున్న మృణాల్:**

తాజాగా ఇన్స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ సరికొత్త స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తోంది. ఈ పిక్స్‌లో ఆమె ధరించిన మోడ్రన్ అవుట్‌ఫిట్ ఆమె పర్సనాలిటీకి పర్ఫెక్ట్‌గా సరిపోయింది. కెమెరా కళ్లకు తన చూపులతో మంత్రముగ్ధులను చేస్తూ, ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ ఫోజులు ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆమె హెయిర్ స్టైల్, ఇయర్ రింగ్స్, సింపుల్ మేకప్ మరియు ఆ యాటిట్యూడ్ ఈ ఫోటోలకు ఒక వింటేజ్ క్లాసిక్ టచ్ ఇచ్చాయి. ఆధునికతను, క్లాస్‌ను మిక్స్ చేస్తూ మృణాల్ చేసిన ఈ ఫోటో షూట్ చూస్తుంటే, ఆమె కేవలం నటి మాత్రమే కాదు, ఒక పర్ఫెక్ట్ మోడల్ అని కూడా నిరూపిస్తోంది.

**సినిమా ప్రయాణం:**

కెరీర్ హిట్స్ , క్రేజీ ప్రాజెక్ట్స్ తో మృణాల్ కెరీర్ ప్రస్తుతం గోల్డెన్ ఫేజ్‌లో ఉంది. తెలుగులో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి క్లాసిక్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న ఈమె, గత ఏడాది తెలుగులో సినిమా లేకపోయినా బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీతో అలరించింది. 2023 లో వచ్చిన హాయ్ నాన్న సినిమా సక్సెస్ తరువాత వరుసగా ఆమె సినిమాలు మూవీస్ వస్తాయి అని అనుకున్నారు. అనుకున్నట్టు గానే విజయదేవరకొండ సరసన 2024లో ఫామిలీ స్టార్ వంటి మూవీ లో నటించారు.కానీ సినిమా అంతగా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక తెలుగులో ఆమె సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఆమె రాబోయే చిత్రాల విషయానికి వస్తే, తెలుగులో అడివి శేష్ తో డెకాయిట్ మూవీలో నటిస్తున్నారు. ఇక బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ప్రభాస్ 'ఫౌజీ' (ఫ్లీఖబయిఖ) సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి, ఇది నిజమైతే టాలీవుడ్‌లో ఆమె క్రేజ్ ఆకాశాన్ని తాకడం ఖాయం. అలాగే హిందీలో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను చాలా ప్లాన్డ్‌గా ముందుకు తీసుకెళ్తోంది. అందానికి కేవలం రూపమే కాదు, ఆత్మవిశ్వాసం కూడా తోడైతే ఎలా ఉంటుందో మృణాల్ ఠాకూర్‌ను చూస్తే అర్థమవుతుంది. అటు వెండితెరపై నటనతో, ఇటు సోషల్ మీడియాలో తన స్టైల్‌తో మృణాల్ చేస్తున్న హంగామా ఇప్పుడప్పుడే తగ్గేలా లేదు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలతో ఆమె మనల్ని అలరించాలని కోరుకుందాం.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secunderabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965